ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
శనివారం 6 డిసెంబరు 2025



గంజాయ్..

చిత్తవుతున్న యువత

- ఒడిషా టూ మదనపల్లె
- రైళ్లు, పార్సిళ్లలో సరఫరా
- భారీగా పెరిగిన వినియోగం
- విక్రేత నుంచి వినియోగం వరకూ
- పోలీసుల కొరడా, పటిష్ట నిఘా
- కౌన్సెలింగ్.. రిహాబిలిటేషన్‌తో చికిత్స
- 30 మందికి పైగా అరెస్టు
- భారీగా గంజాయి స్వాధీనం



ధమ్.. మారో ధమ్.. అంటూ యువత గంజాయి మత్తులో చిత్తవుతున్నారు. స్నేహితులతో కలిసి సరదాగా గంజాయి తాగుతూ చివరికి దానికే బానిసై జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు. ఒకప్పుడు గంజాయి సరఫరా, వినియోగం రెండూ పరిమితంగా, అందులోనూ రహస్యంగా ఉండేది. ఇటీవల విచ్చలవిడి అయిపోయింది. దీని మత్తులో యువత.. సహచరులు, స్నేహితులతో మాటల సందర్భంలో దాడులు, దౌర్జన్యాలకు కూడా దిగుతోంది. ఈ నేపథ్యంలో మత్తు మహమ్మారి నియంత్రణ, నిర్మూలనను కూటమి ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. దీంతో వైసీపీ పాలనలో బీజం పడిన గంజాయి సరఫరా, విక్రయాలు, వినియోగంపై పోలీసులు నిఘా పెంచారు. ఇందులో భాగంగా ఇటీవల మదనపల్లె ఏరియాలో దాడులు నిర్వహించి, సుమారు వంద మందిని పట్టుకోవడంతో చర్చనీయాంశమైంది.

మదనపల్లె, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): విశాఖ, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచే కాకుండా సరిహద్దు ప్రాంతమైన ఒరిస్సా నుంచి గంజాయి దిగుమతి అవుతోంది. తిరుపతి కేంద్రంగా మదనపల్లెకు సరఫరా చేస్తుండగా, ఇక్కడి నుంచి తంబళ్లపల్లె, పీలేరు, పుంగనూరు ఏరియాలకు ఈ వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరిస్తున్నట్లు చెబుతున్నారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చనే ఆశతో కొందరు.. యువత, పనులు లేకుండా ఖాళీగా ఉంటున్న ఆకతాయిలను గంజాయి సరఫరాలోకి దింపుతున్నారు. రైలు, పార్శిల్, ఇతర రవాణా వాహనాల్లో అందుకుంటున్న వ్యాపారులు, తాము ఎంపిక చేసుకున్న ఏజెంట్ల ద్వారా మిగిలిన ప్రాంతాలకు సరఫరా చేస్తున్నట్లు తెలిసింది. కొన్ని చోట్ల చిల్లర దుకాణాల్లో కూడా సిగరెట్లు, బీడీ చుట్టల్లో నింపి విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. పట్టణంలోని సైదాపేట, బెంగళూరు బస్టాండు, దక్నీపేట, ఇందిరానగర్, దేవళంవీధి, మోతీనగర్‌తో పాటు నీరుగట్టువారిపల్లె, రామారావు కాలనీ, చీకలగుట్ట, శివాజీనగర్, బాలాజీనగర్, బసినికొండ, కొత్తయిండ్లు, బుగ్గకాలువ, ఈశ్వరమ్మ కాలనీ ఏరియాలు గంజాయి బ్యాచ్‌కి అడ్డాగా మారాయి. అలాగే పట్టణ శివారు ప్రాంతాలైన కోళ్లబైలు, వైఎస్‌ఆర్ నగర్, అమ్మచెరువుమిట్ట, చంద్రా కాలనీ, బి.కె.పల్లె, రామాచార్లపల్లె, నక్కలదిన్నె, మదనపల్లె బైపాస్ రోడ్డు ఏరియాలలో గంజాయి బ్యాచ్ హల్‌చల్ చేస్తోంది. పోలీసులకు పట్టుబడిన వారిచ్చిన సమాచారం మేరకు.. సైదాపేటలో దాడులు చేస్తే, అక్కడ పట్టుబడిన కొందరు అనుమానితులపై దాడులకు తెగబడ్డారు. ఇది స్థానికంగా సంచలనం సృష్టించింది. అలాగే ఓ వ్యక్తి ఇటీవల బెంగళూరు నుంచి వచ్చి అర్ధరాత్రి బస్సు దిగి నడుచుకుంటూ ఇంటికెళ్తుండగా అటుగా వెళ్తున్న గంజాయి బ్యాచ్ లిఫ్ట్ పేరుతో బయటకు తీసుకెళ్లి దాడి చేశారు. అతడి వద్దనున్న బంగారు చైన్ లాక్కెళ్లారు.

మదనపల్లెతో పాటు కురబలకోట మండలం అంగళ్లు, ముదివేడు, బి.కొత్తకోట, ములకలచెరువు, వాల్మీకిపురం, కలకడ, చిన్నమండెం, పీలేరు, పుంగనూరు ఏరియాలలోని వ్యాపారులు అక్కడక్కడా ఏర్పాటు చేసుకున్న ఏజెంట్ల ద్వారా వినియోగదారులకు విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఇందులో భాగంగానే ఊరికొక్కరిని అదుపులోకి తీసుకోవడం, కేసులు నమోదు చేసి అరెస్టు చేశారు. మొదటగా గంజాయి పొగ పీలుస్తున్న యువతను అదుపులోకి తీసుకుని వారిచ్చిన సమాచారంతో విక్రయ ఏజెంట్లను, అక్కడి నుంచి వచ్చిన సమాచారంతో నిఘా వుంచి వ్యాపారులను అరెస్టు చేసినట్లు చెబుతున్నారు. ఇందులో జులాయిగా తిరిగే యువతతో పాటు కళాశాల, ఇంజనీరింగ్ విద్యార్థులు కూడా పట్టుబడిన వారిలో ఉన్నారు. మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు, పుంగనూరు నియోజకవర్గాల్లో వివిధ ప్రాంతాల్లో చేపట్టిన దాడుల్లో పోలీసులు వందమందిని అదుపులోకి తీసుకున్నారు. ఇందులో బెంగళూరు బస్టాండు సమీపంలోని సైదాపేటలో సామూహికంగా గంజాయి పీలుస్తుండగా, ఇటీవల 20 మందిని పట్టుకున్నారు. ఇలా నక్కలదిన్నె, బెంగళూరు రోడ్డు ఖాళీ ప్రదేశాల్లో మత్తులో ఉన్న యువత అదుపులో ఉన్నారు. ఇందులో భాగంగా విక్రేతలు, గంజాయి పాత నేరస్థులపై కేసులు నమోదు చేసి జైలుకు పంపగా, గంజాయి పాజిటివ్ వచ్చిన వారిలో కొందరికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపేయగా, మరికొందరి మైనర్లను చిత్తూరులోని రిహాబిలిటేషన్ కేంద్రానికి తరలించి ట్రీట్‌మెంట్ ఇస్తున్నారు. ఇలాంటి వారు 20 మందికి పైగా మేజర్, మైనర్లు ఉన్నారు. అలాగే సామూహిక కేంద్రాల్లో ఉన్న చాలా మంది యువతకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు. మరోసారి పట్టుబడితే, చర్యలు కఠినంగా ఉంటాయని డీఎస్పీ మహేంద్రతో పాటు సీఐలు ఎస్.మహ్మద్‌రఫీ, ఎన్.రాజారెడ్డి, కళా వెంకటరమణ, సత్యనారాయణలు హెచ్చరించారు.

గంజాయి కార్యకలాపాల్లో రౌడీషీటర్లు, వివిధ కేసుల్లో ప్రమేయం ఉన్న నిందితులు ఉన్నారు. ఈ క్రమంలో గంజాయి సరఫరా లావాదేవీల్లో వచ్చిన విభేదాలతో ఉపాధి కోసం ఒరిస్సా, పశ్చిమబెంగాల్ నుంచి వచ్చిన ఇద్దరు కూలీలను సీటీఎం సమీపంలో గంజాయి బ్యాచ్ హత్య చేసిందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. దీనిపై రైల్వే పోలీసులతో పాటు వన్‌టౌన్, తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి గంజాయి, హత్యలు, ఇతర నేరాల్లో ప్రమేయం ఉన్న నేరస్థుడిని పట్టణ పోలీసులు ఇటీవల జైలుకు పంపారు. మదనపల్లె, రాయచోటి డివిజన్‌లలో ఇటీవల గంజాయిపై ఉక్కుపాదం మోపుతోంది. ఎక్కడికక్కడ పోలీసులు నిఘా



పెట్టారు. ఎన్నడూ లేని విధంగా రోజుల వ్యవధిలోనే ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో వందమందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు తమదైన శైలిలో గుణపాఠం చెప్పారు. ఇలా మదనపల్లె, ములకలచెరువు, కలకడ, జిల్లా కేంద్రం రాయచోటిలో 30 మందిని అరెస్టు చూపించి, వారి నుంచి 60 కేజీలకు పైగా గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యాపారంలో కొందరు ఇంటిదొంగల ప్రమేయం కూడా ఉన్నట్లు పోలీసు శాఖ గుర్తించి చర్యలు చేపట్టింది. వీరు గంజాయి వ్యాపారులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించినట్లు చెబుతున్నారు.



కలకడలో ఇటీవల పట్టుబడిన గంజాయి



అమ్మకానికి సిద్ధమైన గంజాయి పాకెట్లు

డెకాయ్ ఆపరేషన్‌తో గంజాయి కట్టడి..



డెకాయ్ ఆపరేషన్‌తో గంజాయి కట్టడి చేస్తున్నాం. సివిల్ డ్రెస్‌లో కష్టమర్‌గా గంజాయి వినియోగదారులు, విక్రేతల వద్దకు వెళ్లి సంప్రదిస్తున్నాం. వారి ద్వారా మూలాలు కనుగొని కేసులు నమోదు చేస్తున్నాం. ఈ క్రమంలో గతనెలలో సబ్‌డివిజన్ పరిధిలో అయిదు పోలీస్‌స్టేషన్ల పరిధిలో గంజాయి కట్టడిలో పెద్ద అచీవ్‌మెంట్ సాధించాం. అలాగే పాత నిందితులపై కూడా నిఘా పెట్టి, వారి ట్రాక్‌ను ఫాలో అవుతున్నాం. ఇలా నాలుగు మార్గాల్లో గంజాయి వినియోగం, విక్రయాలపై కొరడా ఝుళిపిస్తున్నాం.

- కె.మహేంద్ర, డీఎస్పీ, మదనపల్లె

బంగారు భవిష్యత్‌కు బాటలు

- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ నిశాంత్‌కుమార్
- పండుగ వాతావరణంలో మెగా పేరెంట్స్ మీటింగ్



పేరెంట్స్ కమిటీ మీటింగ్‌లో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ నిశాంత్‌కుమార్

చిన్నమండెం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): బంగారు భవిష్యత్ కోసం కూటమి ప్రభుత్వం బాటలు వేస్తోందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, కలెక్టర్ నిశాంత్‌కుమార్‌లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ 3.0 కార్యక్రమాన్ని శుక్రవారం పండుగ వాతావరణంలో జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లూరు జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన మెగా పేరెంట్స్ మీటింగ్‌కు ముఖ్య అతిథులుగా రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ నిశాంత్‌కుమార్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం ద్వారా పోషకాహారాన్ని అందిస్తున్నామని, రాబోయేకాలంలో ప్రభుత్వం విద్యా వ్యవస్థలో మరిన్ని సంస్కరణలు తీసుకునున్నదని తెలిపారు. తమ పిల్లల విద్యా సామర్థ్యాలను తెలుసుకునేందుకు తల్లిదండ్రులు పెద్ద ఎత్తున రావడం సంతోషించదగ్గ విషయమన్నారు. విద్యలో పిల్లల బలాబలాలు తెలుసుకొని దానికి అనుగుణంగా ఉపాధ్యాయులు బోధన సాగించాలని ఉపాధ్యాయులకు సూచించారు. చాగంటి కోటేశ్వరరావు చెప్పిన ప్రవచనాల ద్వారా విద్యార్థులకు విలువలు తెలియజేస్తున్నామన్నారు. శనివారం నో బ్యాగ్ డే అన్నారు. అనంతరం కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో జరిగిన పేరెంట్స్ కమిటీ మీటింగ్‌లో మంత్రి మండిపల్లి పాల్గొన్నారు. అలాగే మండలంలోని బోరెడ్డిగారిపల్లె గ్రామంలో మంత్రి ప్రజాదర్బార్ నిర్వహించి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించి సమస్యల పరిష్కారానికి అధికారులను ఆదేశించారు.

ఏపీ మోడల్ స్కూల్ ఆకస్మిక తనిఖీ

- విద్యార్థులతో కలిసి కలెక్టర్ సహపంక్తి భోజనం

రాయచోటిటౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాయచోటి మండల పరిధిలోని శిబ్యాల గ్రామంలోని ప్రభుత్వ ఏపీ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలను కలెక్టర్ నిశాంత్‌కుమార్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో జరుగుతున్న తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం, మెగా పీటీఎం కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో కలిసి కలెక్టర్ సహపంక్తి భోజనం చేస్తూ పిల్లలతో మాట్లాడారు. అలాగే డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో భోజన నాణ్యతను పరిశీలించి పిల్లలు, తల్లిదండ్రుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భనలో భాగంగా పాఠశాలలో నిర్వహిస్తున్న పేరెంట్-టీచర్ సమావేశంలో పాల్గొని, విద్యార్థుల విద్యాపురోగతి, హాజరు, అభివృద్ధి, ప్రవర్తన తదితర అంశాలపై తల్లిదండ్రుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల బోధన విధానం, పరీక్షా ఫలితాలపై సమగ్ర సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. పాఠశాల శుభ్రత, మౌలిక వసతుల మెరుగుదలకు ప్రాధాన్యం ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థుల మానసిక, శారీరక వికాసం కోసం క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, పాఠశాల ప్రధానాచార్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఏపీ మోడల్ స్కూల్‌లో విద్యార్థులతో సహపంక్తి భోజనం చేస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

రెండు వరుసల రహదారి పనులకు మోక్షం

- నాడు వైసీపీ నేతల నిర్లక్ష్యం
- నేడు కూటమితో ముందడుగు

6

డీడీఓల్లో డ్వామా క్లస్టర్ కేంద్రాల విలీనం

6

- కడప, అన్నమయ్య జిల్లాల్లోని సీఎల్‌ఆర్సీలు తరలించే ఏర్పాట్లు

గ్లోబల్ ఆస్పత్రి రిజిస్ట్రేషన్ రద్దు

- ఆస్పత్రికి హెచ్చరిక బోర్డు ఏర్పాటు

మదనపల్లె అర్బన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం మదనపల్లె ఎస్బీఐ కాలనీలోని గ్లోబల్ ఆస్పత్రి రిజిస్ట్రేషన్‌ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ లక్ష్మీనరసయ్య రద్దు చేశారు. ఇందులో భాగంగా ఆస్పత్రి ప్రధాన ద్వారం వద్ద హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేసి అందులో ఆస్పత్రి రిజిస్ట్రేషన్ రద్దు, ఇక్కడ ఎటువంటి వైద్య సేవలు అందించబడవు అని బోర్డు ఏర్పాటు చేశారు. నెల రోజులుగా ఈ ఆస్పత్రిలో కిడ్నీ రాకెట్ కేసు నడుస్తున్న విషయం పాఠకులకు విదితమే. కార్యక్రమంలో డాక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రభాకర్, శాంతి, తరుణ్, తదితరులు పాల్గొన్నారు.

ఇంధన పరిరక్షణపై విద్యార్థులకు పోటీలు

కడప, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇంధన పరిరక్షణ-ఆవశ్యకతపై వివిధ పోటీలు నిర్వహించనున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంస్థ పరిధిలోని తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, నెల్లూరు, కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో 9, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులు మాత్రమే ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు ఇంధన పరిరక్షణ వారోత్సవాలు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ఇందులో భాగంగా 16వ తేదీన ప్రభుత్వ పాఠశాల్లో విద్యనభ్యసిస్తున్న 9, 10 తరగతుల విద్యార్థులకు ఇంధన పరిరక్షణ- ఆవశ్యకత అంశంపై క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. తొలుత సంస్థ పరిధిలోని 9 జిల్లాల్లో డివిజనల్, సర్కిల్ స్థాయిల్లో నిర్వహించే క్విజ్, వక్తృత్వ పోటీల్లో పాల్గొని గెలుపొందిన విద్యార్థులకు ఈ నెల 16న తిరుపతి నుంచి ఆన్‌లైన్ ద్వారా ఫైనల్ రౌండ్ పోటీలు నిర్వహించి విజేతలకు ఈ నెల 20న బహుమతులు ప్రదానం చేస్తామని వివరించారు. మరిన్ని వివరాలకు 87124 80430, 87124 80431 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కోదండరామాలయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

- టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్

ఒంటిమిట్ట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయ అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్ తయారు చేస్తున్నట్లు టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ పేర్కొన్నారు. శుక్రవారం తిరుమలలోని టీటీడీ పరిపాలన భవనంలోని ఈవో ఛాంబర్‌లో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే 50 ఏళ్లకు సరిపడేలా ఒంటిమిట్ట రామాలయాన్ని అభివృద్ధి చేసేందుకు మాస్టర్‌ప్లాన్‌ను తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆలయానికి ప్రతిరోజు భక్తులు ఎంతమంది వస్తారు, ఆలయ పరిసరాలు ఎలా ఉండాలి, ఆలయానికి వచ్చే భక్తులకు మౌలిక సదుపాయాలు, వసతి రవాణా, చారిత్రక నేపథ్యం ఉట్టిపడేలా ఆధ్యాత్మికత, మరింతగా భక్తులు వచ్చేలా ముందస్తు ప్రణాళికలతో మాస్టర్ ప్లాన్‌లను రూపొందించాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. కల్యాణకట్ట, పుష్కరిణి, నక్షత్రవనాలు, గార్డెనింగ్, పచ్చదనం, ఆధ్యాత్మిక చిహ్నాలు, మ్యూజియం, ఉద్యానవనాలు, డిజిటల్ స్ర్కీన్స్, సాంస్కృతిక కళామందిరం, తోరణాలు, ఒంటిమిట్ట చెరువులో 108 అడుగుల జాంబవంతుడి విగ్రహం, మాడవీధుల అభివృద్ధి, సీసీ కెమెరాల ఏర్పాటు తదితర అంశాలపై ఈ ప్లాన్లు రూపొందించాలన్నారు. మాస్టర్‌ప్లాన్ రూపకల్పనలో టీటీడీ విజిలెన్స్, అటవీశాఖ, అన్నదానం గార్డెనింగ్, ఎలక్ట్రికల్ తదితర శాఖల అధికారులను భాగస్వామ్యం చేసి ఒంటిమిట్ట ఆలయ అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్ తయారు చేస్తున్నామన్నారు. విజయవాడకు చెందిన స్కూల్ ఆఫ్ ప్లానింగ్ ఆర్కిటెక్చర్ అనిల్‌కుమార్ మాస్టర్‌ప్లాన్‌కు సంబంధించి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో టీటీడీ సీఈ టీవీ సత్యనారాయణ, ఎస్ఈ-1 మనోహరం తదితరులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఈవో అనిల్‌సింఘాల్

గ్రీన్‌ఫీల్డ్ రహదారి వెంట.. గోల్‌మాల్..!

- ప్రభుత్వ, డీకేటీ భూములు కాజేసే యత్నం
- లిటిగేషన్, ప్రభుత్వ భూములు గుర్తించే పనిలో గ్యాంగ్‌లు
- ఇప్పటికే వంద ఎకరాలకు పైగా ఆక్రమణ

(కడప-ఆంధ్రజ్యోతి): కడప-రేణిగుంట గ్రీన్‌ఫీల్డ్ రహదారి ఎన్నో ఏళ్ల కల. ఈ రహదారి నిర్మాణానికి ఉన్న చిక్కుముడులు వీడిపోయి కాంట్రాక్టరు ఇటీవలే పనులకు టెంకాయ కొట్టారు. పనులు పూర్తయితే రెండున్నర గంటల్లోపే కడప నుంచి రేణిగుంటకు చేరుకోవచ్చు. అయితే ఈ రహదారిపై సిద్దవటం, కడప, రాజంపేట ప్రాంతానికి చెందిన గ్యాంగుల కన్ను పడింది. రహదారికి ఇరువైపులా ఎక్కడెక్కడ ప్రభుత్వ, లిటిగేషన్, డీకేటీ భూములున్నాయో గుర్తించే పనిలో బిజీగా ఉన్నాయి. ఇప్పటికే సిద్దవటం, ఒంటిమిట్ట మండలాల వరకు గ్రీన్‌ఫీల్డ్ రహదారికి ఇరువైపులా ఉండే భూములు కొట్టేసేందుకు రంగంలోకి దిగినట్లు చెబుతారు. సుమారు వంద ఎకరాల భూములు అడ్డదారిలో తమ చేతుల్లోకి తీసుకున్నారని సమాచారం. వీటి విలువ కనీసం రూ.100 కోట్లు ఉంటుందని చెబుతున్నారు.

రేణిగుంట-కడప జాతీయ రహదారి-16ను రెండు ప్యాకేజీలుగా విభజించారు. మొదటి ప్యాకేజీలో కడప - చిన్నఓరంపాడు వరకు 64.2 కి.మీ, ప్యాకేజీ-2లో చిన్నఓరంపాడు నుంచి రేణిగుంట వరకు 57.35 కి.మీగా విభజించారు. రూ.3,150 కోట్ల వ్యయంతో పనులు చేపట్టారు. ఈ రహదారికి సంబంధించి ఇప్పటికే భూసేకరణ పూర్తయింది. రోడ్డు వెళ్లే మార్కింగ్ కూడా చేశారు. కడప నగర శివారులోని సిద్దవటం మండలం కనుమలోపల్లె రహదారి ప్రాంతాల్లో అక్కడక్కడా ప్రభుత్వభూములు ఉన్నాయి. ఈ భూములు కొట్టేసేందుకు సిద్దవటానికి చెందిన 'కే' బ్యాచ్ రంగంలోకి దిగింది. ఈ రహదారి నిర్మాణంలో ప్రైవేటు భూములకు పరిహారం చెల్లించారు. కనుమలోపల్లె సమీపంలో సర్వే నెంబర్ 39/1, 112/2, 40/1లో ప్రభుత్వభూమి ఉంది. అడంగల్‌లో ప్రభుత్వ భూమిగా నమోదై ఉంది. ఈ భూముల గుండా రోడ్డు పోతుంది. ఇక్కడ మార్కింగ్ చేశారు. అయితే ఈ భూములు కూడా ఇప్పుడు చదను చేశారు. ఇవి 'కే' గ్యాంగ్ ఆధీనంలో ఉన్నట్లు చెబుతున్నారు. భాకరాపేట వరకు 'కే' బ్యాచ్ ప్రభుత్వ భూమితో పాటు లిటిగేషన్ భూములను గుర్తించి కోటి రూపాయల విలువ చేసే భూములు రూ.20లక్షలకు రాయించుకుని అడ్డగోలుగా ఆన్‌లైన్ ఎక్కించుకున్నారని చెబుతారు. ఇక భాకరాపేట నుంచి ఒంటిమిట్ట సమీపం వరకు కడప, రాజంపేటకు చెందిన 'ఆర్' గ్యాంగ్ రంగంలోకి దిగి భూములు కొట్టేసేందుకు అన్వేషణ సాగిస్తోందని అంటున్నారు. ఈ గ్యాంగ్‌కు సిద్దవటంలోని కొందరు రెవెన్యూ అధికారులు సహకరిస్తున్నారని ప్రచారం సాగుతోంది. గ్రీన్‌ఫీల్డ్ రహదారికి ఇరువైపులా జరిగిన భూదందాపై కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సమగ్ర విచారణ జరిపితే కబ్జా గ్యాంగ్‌ల భాగోతం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

చర్చ సాగేనా..?

- అన్నదాతలకు సాయం అందేనా
- సమస్యలు పరిష్కారం అయ్యేనా..
- నేడు జడ్పీ సర్వసభ్య సమావేశం



కడప రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): జడ్పీ సమావేశాలతో జిల్లా అభివృద్ధికి బాటలు పడేవి. చాలా వరకు ప్రజా సమస్యలు పరిష్కారానికి నోచుకునేవి. మౌలిక వసతులు సమకూరేవి. సాగునీరు, తాగునీరు, విద్య, వైద్య సౌకర్యాలు మెరుగుపడేవి. ఇప్పుడు అంతా రివర్స్. ప్రస్తుత పాలకమండలితో ఇప్పటి వరకు 16 జడ్పీ సర్వసభ్య సమావేశాలు జరిగాయి. ఏ ఒక్క సమావేశంలోను ప్రజాసమస్యలకు పరిష్కారం చూపింది శూన్యం. శనివారం ఉదయం 10 గంటలకు జడ్పీ సర్వసభ్య సమావేశం జరగనుంది. అధికార, ప్రతిపక్ష ప్రజాప్రతినిధులు పాల్గొంటున్న ఈ సమావేశంలో జిల్లాలోని సమస్యలపై గళం విప్పి పరిష్కారం చూపుతారనే గంపెడాశతో జనం ఎదురుచూస్తున్నారు.

డీలా పడ్డ వ్యవసాయ రంగం

జిల్లాలో వ్యవసాయరంగం డీలా పడింది. ఖరీఫ్‌లో అసమతుల్య వర్షాలతో ఆశించిన దిగుబడులు లేక రైతులు నష్టపోయారు. రబీలో కూడా అధికవర్షాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నెల రోజుల వ్యవధిలోనే వరుసగా మూడు తుఫానులు రావడంతో చేతికి అందించిన వరిపంట వర్షార్పణం అవుతోంది. దాదాపు రూ.659 లక్షల మేర 2123.43 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. వీటిలో 90శాతం వరిపంట ఉంది. ఈ గాయం మానకముందే తాజాగా దిత్వా తుఫాను జిల్లా రైతాంగాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఈ రబీలో దాదాపు లక్ష ఎకరాలలో బుడ్డశనగ సాగుచేశారు. ఈ పంటలపై దిత్వా తుఫాను తీవ్ర ప్రభావం చూపడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఉల్లి ధరలు పతనం కావడంతో రైతులకు కన్నీరే మిగిలింది. తాజాగా అరటి దిగుబడులకు ధరలు లేక రైతులు అల్లాడుతున్నారు. ప్రభుత్వ సాయంకోసం రైతాంగం ఎదురుచూస్తోంది.



అట్లూరు మండలంలో దిత్వా తుఫాను దెబ్బకు నీటిపాలైన వరి పంటను చూపుతున్న రైతు

● పశుసంవర్ధకశాఖ :

పశువైద్యం గాలిలో దీపంలా మారింది. అధికారులు అందుబాటులో ఉండడం లేదని రైతులు వాపోతున్నారు. పశునష్టపరిహారం చెల్లింపుకోసం బాధిత రైతులు ఎదు రుస్తున్నారు. పశుగ్రాస విత్తన సరఫరా అంతంత మాత్రమే సాగుతోంది. పెయ్యదూడల సంఖ్య పెంపు గణాంకాలకే పరిమితమవుతోంది.

● స్త్రీ, శిశుసంక్షేమశాఖ :

అంగన్‌వాడీ భవన నిర్మాణాలకు బాలారిష్టాలు పట్టుకున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలలో మరుగుదొడ్ల నిర్మాణాలు నాణ్యతా లోపంగా సాగుతున్నాయి. బాల సంజీవని పథకం కిట్స్ పక్కదారి పడుతున్నాయి. బాలకార్మికులను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాల్సిన ఐసీడీఎస్ అధికారులు దాన్ని పూర్తిగా మరిచిపోయారు.

● విద్యాశాఖ :

పలు పఠశాలల్లో ప్రహరీ గోడలు, ఇతర మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. మధ్యాహ్న భోజనం మెనూ సక్రమంగా పాటించడం లేదని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. 80 శాతం వసతి గృహాలలో తాగునీరు, ఇతర మౌలిక వసతులు లేక విద్యార్థులు అల్లాడుతున్నారు.

● పంచాయతీశాఖ :

జిల్లాలో 557 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. చాలా గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. 15వ ఆర్థిక సంఘం పనులు నాసిరకంగా చేపట్టారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పన్ను వసూళ్లలో సిబ్బంది చేతివాటాన్ని ప్రదర్శిస్తు ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. ట్రై సైకిళ్లు చాలా వరకు మూలన పడడంతో చెత్త సేకరణ నత్తనడకన సాగుతోంది. పల్లెల్లో పారిశుధ్యం పడకేసింది. జిల్లాలో కొంత కాలం నుంచి ముసురు వానలు పడుతుండడంతో ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారు. ప్రస్తుత వర్షాలకు గ్రామీణ రోడ్లు అధ్వాన్నంగా మారాయి. ఉపాధి ద్వారా చేపట్టిన పనులకు 10 నెలల నుంచి బిల్లులు చెల్లించడం లేదు. వీటన్నింటిపై జడ్పీ సర్వసభ్య సమావేశంలో చర్చసాగించి పరిష్కారం చూపుతారని జనం ఎదురుచూస్తున్నారు.

సెంట్రల్ జైలు కోసం స్థల పరిశీలన



జైలు అధికారులతో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి(కలెక్టరేట్), డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో సెంట్రల్ జైలు నిర్మాణం కోసం శుక్రవారం సాయంత్రం మంత్రి రాంప్రసాద్‌రెడ్డి స్థలాన్ని పరిశీలించారు. జైలు అధికారులతో కలిసి పట్టణంలోని రింగురోడ్డులో గల ప్రభుత్వ భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు పది ఎకరాల స్థలంలో జిల్లా సెంట్రల్ జైలును అత్యాధునిక నూతన హంగులతో ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జైలు అధికారులు, పోలీసు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

పనితీరు మార్చుకోకుంటే.. కఠిన చర్యలు

- ఎస్పీడీసీఎల్ అధికారులకు సీజీఎం హెచ్చరిక



అధికారులతో సమీక్షిస్తున్న ఎస్పీడీసీఎల్ సీజీఎం

మదనపల్లెటౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు సేవలందించడంలో ఎస్పీడీసీఎల్ క్షేత్రస్థాయి సిబ్బంది, అధికారులు పనితీరు మెరుగుపరచుకోవాలని ఎస్పీడీసీఎల్ సీజీఎం జానకిరామ్ సూచించారు. శుక్రవారం స్థానిక ఫంక్షన్‌హాల్లో మదనపల్లె ఎస్పీడీసీఎల్ డివిజన్‌లోని 11 మండలాల ఏఈలు, క్షేత్రస్థాయి సిబ్బందితో సీజీఎం సమీక్షించారు. ఎనిమిది నెలలుగా 11 మండలాల ఏఈలు, వారి సిబ్బంది పనితీరుపై వినియోగదారుల నుంచే ఫీడ్‌బ్యాక్ తీసుకున్నామన్నారు. కమర్షియల్ ఎస్ఈ సోమశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ సిబ్బంది ఎవరి విధులు వారే తెలుసుకుని విధులు సక్రమంగా నిర్వహిస్తే దానంతట అదే సత్ఫలితాలు వస్తాయన్నారు. సమావేశంలో మదనపల్లె ఎస్పీ డీసీఎల్ ఈఈ గంగాధరం, ఏడీఈలు హరిబాబు, సురేంద్ర, గోవిందరెడ్డి, 11 మండలాల ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

పురాతన ఆలయాల అభివృద్ధికి చర్యలు

గాలివీడు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ మారుమూల ప్రాంతాల్లోని పురాతన ఆలయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు దేవదాయ సహాయ కమిషనర్ విశ్వనాథ్ తెలిపారు. శుక్రవారం నూలివీడు పంచాయతీ నల్లాబత్తినవారిపల్లెలో శ్రీవాణి ట్రస్టు ద్వారా రామాలయ నిర్మాణానికి తగిన స్థలాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ దరఖాస్తు చేసిన ఆలయాల స్థలాలను పరిశీలించి నివేదికను కమిషనర్‌కు పంపుతామని తెలిపారు. దేవదాయ శాఖలో రిజిస్టర్డై పబ్లికేషన్ అయివున్న పురాతన ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా 36 ఆలయాలు ధూప దీప నైవేద్యానికి ఎంపికయ్యాయన్నారు. కార్యక్ర మంలో ఎండోమెంట్ ఏఈ రవితేజ, స్థానికులు హిమకర్‌రెడ్డి, నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డులకు ఆటల పోటీలు



పోలీస్‌పరేడ్ మైదానంలో పరుగు పందెంలో మహిళా హోంగార్డులు

రాయచోటిటౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): హోంగార్డ్స్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక పోలీసు పరేడ్ మైదానంలో శుక్రవారం జిల్లా హోంగార్డుల ఆటల పోటీలు నిర్వహించారు. హోంగార్డుల్లో శారీరక దారుఢ్యం, క్రమశిక్షణ, టీమ్ స్పిరిట్ పెంపొందించేందుకు ఈ క్రీడలు ముఖ్యమైన వేదికగా నిలుస్తాయని ఎస్పీ అభిప్రాయపడ్డారు. ఈ పోటీల్లో 100 మీటర్ల పరుగు, షాట్‌పుట్, వాలీబాల్, టగ్ ఆఫ్ వార్ వంటి పోటీలు నిర్వహించారు. అధిక సంఖ్యలో హోంగార్డులు ఉత్సాహంగా క్రీడా పోటీల్లో పాల్గొని తమ క్రీడా నైపుణ్యాన్ని, శారీరక దారుఢ్యాన్ని ప్రదర్శించారు. అనంతరం ఎస్పీ ధీరజ్ కునుబిల్లి విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేస్తారు. కార్యక్రమంలో ఆర్ఐ పెద్దయ్య, ఆర్ఎస్ఐలు శ్రీనివాసులు, రవి, అమరనాథ్‌రెడ్డి, హోంగార్డ్స్ ఇన్‌చార్జిలు బాలాజీ, రమేశ్, లక్ష్మిరెడ్డి, హోంగార్డులు పాల్గొన్నారు.

ఎనిమిది మంది 'ఎర్ర'స్మగ్లర్ల అరెస్టు

- 12 దుంగల స్వాధీనం



స్మగ్లర్ల అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

మంగళం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా సానిపాయ అటవీ పరిధిలోని రాయవరం సెక్షన్‌లో శుక్రవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు కూంబింగ్ నిర్వహించి ఎనిమిది మంది స్మగ్లర్లను అరెస్టు చేసి, 12 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. కడప సబ్ కంట్రోల్‌కు చెందిన ఆర్ఎస్ఐ నరేశ్ బృందం స్థానిక ఫారెస్టు బీటు ఆఫీసర్ అంజనాస్వాతితో కలిసి శుక్రవారం తెల్లవారుజామున అన్నమయ్య జిల్లా సానిపాయ అటవీ పరిధిలోని రాయవరం సెక్షన్ చిన్నముచ్చురాళ్లగుట్ట వద్ద కూంబింగ్ చేపట్టారు. కొంతమంది గుమికూడి ఉండటం గమనించి, సమీపిస్తుండగా వారు పారిపోయే ప్రయత్నం చేశారు. వెంబడించి ఎనిమిది మందిని పట్టుకున్నారు. చుట్టుపక్కల పరిశీలించగా 12 ఎర్రచందనం దుంగలు లభించాయి. నిందితులు తమిళనాడు కల్లకురిచ్చి జిల్లాకు చెందిన వారిగా గుర్తించారు. స్మగ్లర్లను, ఎర్రచందనం దుంగలను తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సీఐ ఖాదర్‌బాషా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రెండు వరుసల రహదారి పనులకు.. మోక్షం

- నాడు వైసీపీ నేతల నిర్లక్ష్యం
- నేడు కూటమితో ముందడుగు
- అభివృద్ధికి రూ.5.5 కోట్లు విడుదల
- సుండుపల్లెలో రూ.14 లక్షలతో టెండర్లు పూర్తి

సుండుపల్లె, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో పాలకులు అభివృద్ధిని మరిచారు. రోడ్లను ప్రారంభించి మధ్యలో వదిలేయడంతో వాహనదారులు అష్టకష్టాలు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది.



రూ.14 లక్షలతో పనులు జరగాల్సిన రోడ్డులో వర్షపు నీరు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పల్లె పండుగ పేరిట గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యమిచ్చింది. అయితే గత ఐదేళ్ల క్రితం వైసీపీ పాలనలో రాయచోటి- సుండుపల్లె డబుల్ రోడ్డు పనులను ప్రారంభించారు. రాయచోటి సమీపంలోని ఆంజనేయస్వామి గుడి వద్ద నుంచి సుండుపల్లె భైరవ గుట్ట వరకు 20 కి.మీ. రోడ్డును విస్తరించేందుకు రూ.61.40 కోట్లు నిధులతో పనులు ప్రారంభించారు. ఈ నిధులతో రాయచోటి ఆంజనేయ స్వామి ఆలయం నుంచి శిబ్యాల, అనుంపల్లి మధ్య రహదారిని మొదలు పెట్టి వదిలేశారు. ఈ మార్గంలో శిబ్యాల వంకపై శిథిలావస్థలో ఉన్న వంతెనకు పక్కనే నూతన వంతెన నిర్మాణానికి కడ్డీలు అమర్చి స్లాబ్ వేయకపోవడంతో అవి తుప్పు పట్టాయి. ఆగిపోయిన పనులను ప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది.

రహదారుల అభివృద్ధికి రూ.5.5 కోట్లు

నాలుగేళ్ల క్రితం ప్రారంభించి అర్థాంతరంగా ఆగి పోయిన పనులు ప్రారంభించి పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. ప్రారంభించి అర్థాంతరంగా వదిలేసిన పనులను పూర్తి చేసి ప్రయాణి కులకు ఇబ్బందులు లేకుండా చూసేందుకు కూటమి ప్రభుత్వం రూ.5.5 కోట్లు నిధులు విడుదల చేసినట్లు రవాణా, భవనములశాఖ అధికారులు చెబుతున్నారు. రాయచోటి- రాజంపేట మార్గమధ్యంలో, రాయచోటి- సుండుపల్లె మార్గమధ్యంలో ఆగిపోయిన పనులను పూర్తి చేసేందుకు ప్రభుత్వం జీవో విడుదల చేయడం జరిగింది. త్వరలో టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభించ నున్నట్లు అధికారులు చెబుతున్నారు.



గత ప్రభుత్వంలో ప్రారంభించి వదిలేసిన ప్రధాన రహదారి

రూ.14 లక్షలతో టెండర్లు పూర్తి

మండల కేంద్రంలో కెనరా బ్యాంకు ఎదురుగా ప్రధాన రహదారిపై వర్షపు నీరు, మురికినీరు నిలువ ఉండ డంతో వాహనదారులు, బాటసారులు తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారు. రోజు వందలాది వాహ నాలు తిరిగే రవాణా భవనముల శాఖ రహదారి కొన్ని సంవత్సరాలుగా మోకాళ్ల లోతు రోడ్డు గుంతగా మారి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గత కన్ని సంవత్సరాలుగా ఎవ్వరూ పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వంలో ఆ సమస్య పరిష్కారానికి రూ.14 లక్షలు నిధులు మంజూరు చేయడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. టెండర్లు పూర్తి అయ్యాయని, ప్రస్తుతం వర్షాలు పడుతున్నాయి. వర్షాలు ఆగిన వెంటనే పనులు ప్రారంభిస్తామని అధికారులు చెబుతున్నారు.



అత్యవసరంగా నిర్మించాల్సిన బ్రిడ్జి

రహదారి సమస్యలు పరిష్కారం

- కుమార్‌బాబు, రవాణా, భవనాల శాఖ ఏడీ

సుండుపల్లె- రాయచోటి మార్గమధ్యంలో రహదారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. త్వరలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభించడం జరుగుతుంది. మండల కేంద్రంలో రూ.14 లక్షలతో టెండర్లు పూర్తి అయ్యాయి. పనులు ప్రారంభిస్తాము.

డీడీఓల్లో డ్వామా క్లస్టర్ కేంద్రాల విలీనం

- కడప, అన్నమయ్య జిల్లాల్లోని సీఎల్ఆర్సీలు తరలించే ఏర్పాట్లు

కలికిరి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్య మంత్రి పవన్‌కల్యాణ్ గురువారం ప్రారంభించిన డివిజనల్ డెవలప్‌మెంట్ కార్యాలయాలను రెవెన్యూ డివిజన్ స్థాయిలో అన్నివిధాలా బలోపేతం చేయడానికి ప్రభుత్వం చర్యలు మొదలు పెట్టింది. కొత్తగా ఏర్పాటవుతున్న డీడీఓ కార్యాలయాలు మినీ కలెక్టరేట్‌లుగా పనిచేస్తాయని ఇప్పటికే ప్రభుత్వం స్పష్టం చేసింది. నాలుగేళ్లగా దిశా నిర్దేశం లేకుండా ఉన్న డీడీఓ పోస్టులను కీలక విభాగానికి అనుసంధానించి పలు అధికారాలను కట్టబెట్టే దిశగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. అందులో భాగంగా ఇప్పటికే డివిజనల్ పంచాయతీ అధికారులను డీడీఓలకు అప్పగించారు. దీనికి కొనసాగింపుగా తాజాగా డ్వామా ఆధ్వర్యంలో ఉపాధి హామీ, వాటర్ షెడ్ పనులను పర్యవేక్షిస్తున్న క్లస్టర్ కార్యాల యాలను ఏపీడీలతో సహా డీడీఓ కార్యాలయాల్లో విలీనం చేస్తూ గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. వైఎస్సార్ కడప జిల్లాలోని నాలుగు క్లస్టర్ లెవెల్ రిసోర్స్ కేంద్రాలు (సీఎల్ఆర్సీలు), అన్నమయ్య జిల్లాలోని మూడు సీఎల్ఆర్సీలను డీడీఓ కార్యాలయాలకు తరలించే ఏర్పాట్లు చేసింది. అందులో పనిచేసే ఏపీడీలను కూడా డీడీఓల అజమాయిషీకి మార్చారు. ప్రస్తుత సీఎల్ఆర్‌సీ భవనాల్లో డీడీఓ కార్యాలయాలను కూడా ఏర్పాటు చేస్తున్నారు.

కడప జిల్లాలో..

మైదుకూరు క్లస్టర్‌ను ఏపీడీ బి.మైథిలి సహా బద్వేలు డీడీఓ కార్యాలయంలో విలీనం చేశారు. జమ్మల మడుగు సీఎల్ఆర్సీని ఏపీడీ ఆర్.రామలింగేశ్వర్ రెడ్డి సహా జమ్మలమడుగు డివిజన్‌లో, కమలాపురం సీఎల్ఆర్సీని ఏపీడీ కె.అజాద్ సహా కడప డీడీఓ కార్యాలయంలో విలీనం చేశారు. పులివెందుల సీఎల్ ఆర్సీని కూడా పులివెందుల డీడీఓలోకి తరలించనున్నారు. ఇక్కడ ఏపీడీ పోస్టు ఖాళీగా ఉన్నందున పులివెందుల డీడీఓ వి.విజయలక్ష్మిని తాత్కాలికంగా ఇన్‌చార్జి ఏపీడీగా నియమించారు.

అన్నమయ్య జిల్లాలో..

మదనపల్లె (తంబళ్లపల్లె) క్లస్టర్‌ను మదనపల్లె డీడీఓ అధీనంలోకి మార్చారు. కలికిరి క్లస్టర్ ఏపీడీగా పనిచేస్తున్న ఎన్.శ్రీనివాసులును కూడా మదనపల్లె డీడీఓ కార్యాలయానికి బదిలీ చేశారు. అయితే మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయాన్ని కొత్తగా ఏర్పాటు కానున్న కలెక్టర్ ఆఫీసుకు వినియోగించాలనే ఆలోచనతో ఇక్కడున్న సీఎల్ఆర్సీ భవనాన్ని సబ్ కలెక్టర్ కార్యాలయం ఏర్పాటుకు పరిశీలిస్తున్నారు. ఇదే జరిగితే డీడీఓ కార్యాలయానికి ప్రత్యామ్నాయ వసతి చూడాల్సి ఉంది. ఇక రాజంపేట క్లస్టర్‌ను ఏపీడీ ఎం.ప్రతాప్‌తో సహా రాజంపేట డీడీఓకు అనుసంధానిస్తున్నారు. రాయచోటి క్లస్టర్‌ను ఏపీడీ ఎస్.మధుబాబుతో సహా రాయచోటి డీడీఓ కార్యాలయంలో విలీనం చేస్తు న్నారు. కాగా కలికిరి క్లస్టర్ రద్దవుతున్న నేపథ్యంలో ఇక్కడ డిప్యుటేషన్‌లో ఉన్న ఏపీడీ వై.నందకుమార్ రెడ్డిని రాయచోటి డ్వామా కార్యాలయానికి బదిలీ చేశారు. ఈ మేరకు పంచాయతీ రాజ్, గ్రామీణా భివృద్ధి శాఖ కమిషనర్ మైలవరపు వీఆర్ కృష్ణతేజ ఆదేశాలు జారీ చేశారు. త్వరలో పీలేరులో కొత్త రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కానున్న నేపథ్యంలో డీడీఓ కార్యాలయం కూడా ఏర్పాటవుతుంది. దీనిలో విలీనం చేయడానికి పీలేరు క్లస్టర్ ఏపీడీ కార్యాల యం సర్దుబాటును ప్రస్తుతానికి వాయిదా వేశారని సమాచారం.

రూ.5.73 కోట్లతో పట్టాభిరామాలయ అభివృద్ధి

- మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రమౌళి

వాల్మీకిపురం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురంలో వెలసిన పురాతన పట్టాభి రామాలయ అభివృద్ధికి పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక చొరవతో రూ.5.73 కోట్లు టీటీడీ నిధులు మంజూరు చేసిందని మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రమౌళి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఆలయ సమీపంలోని స్వామివారి బ్రహ్మరథం షెడ్డు అభివృద్ధి పనులకు రూ.3లక్షలతో జరుగుతున్న పనులను టీడీపీ నేతలతో కలిసి ఆయన పరిశీలించారు. ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, జేఈఓ వీరబ్రహ్మం సహకారంతో ఆలయంలో వివిధ అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాయన్నారు. పట్టాభిరాముడి రథం చుట్టూ షెడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు పనులు కూడా చేపట్టడం హర్షనీయమన్నారు. ఇప్పటికే వాల్మీకిపురంలో టీటీడీ స్వాగత ఆర్చిల నిర్మాణానికి రూ.30లక్షలు, కోనేటి వీధిలోని పట్టాభి రాముడి గరుడ పుష్కరిణి అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు రూ.1.12కోట్లు, తోటవీధిలోని ఆరుబయట పట్టాభిరాముడి కల్యాణ వేదిక అభివృద్ధి పనులకు సంబంధించి రూ.73 లక్షలతో టీటీడీ టెండర్లు పూర్తి చేశారన్నారు. అలాగే ఆలయం వెనుక భాగంలోని రాజ గోపురం నిర్మాణానికి రూ.52 లక్షలు, స్థానిక టీటీడీ కల్యాణ మండపం పునఃనిర్మాణ పను లకు రూ.1.80కోట్లు, పార్వేట మండప నిర్మాణా నికి రూ.1.26 కోట్లు, తరిగొండ లక్ష్మీనరసింహ స్వామి ఆలయ కోనేరు అభివృద్ధి పనులకు రూ.1.50కోట్లు నిధులను టీటీడీ మంజూరు చేసిందని త్వరలోనే టెండర్లు పూర్తి చేసి పనులు కూడా ప్రారంభిస్తామన్నారు. కార్యక్ర మంలో నాయకులు పీవీ నారాయణ, రాజేంద్రా చారి, కోసూరి రమేష్, మున్వర్, కేకేనాయుడు, గాంధీపేట రెడ్డి, సయ్యద్‌బాషా, శ్రీనివాసులు పాల్గొన్నారు.



వాల్మీకిపురంలో రథం షెడ్డు పనులను పరిశీలిస్తున్న నాయకుడు

వైభవంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం

రాయచోటిటౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శుక్రవారం అయ్యప్ప స్వామి గ్రామోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. విద్యుత్ దీపాలతో అలం కరించిన వాహనంపై అయ్యప్ప స్వామి ఉత్సవ విగ్రహాన్ని ఏర్పాటు చేసి అయ్యప్ప భక్తుల కోలాటాల నడుమ గ్రామోత్సవం నిర్వహించారు. రాయచోటి పట్టణంతో పాటు చుట్టుప్రక్కల ప్రాంతాలకు చెందిన అయ్యప భక్తులు వందల సంఖ్యలో గ్రామోత్సవంలో పాల్గొన్నారు. స్థానిక ఎస్ఎన్ కాలనీ చెక్‌పోస్టు సమీపంలోని ఉమా మహేశ్వరస్వామి ఆలయం నుంచి ఈ ఉత్సవం ప్రారంభమైంది. అర్చకులు నటరాజ స్వామి, ఆలయ కమిటీ సభ్యులు అరమాటి శివగంగి రెడ్డి, ఇతర స్వాములతో కలిసి పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్వామి వారి గ్రామోత్సవాలు చూసేందుకు అయ్యప్ప స్వా ములతో పాటు రాయచోటి నియోజకవర్గ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహిళలు స్వామివారికి కాయ కర్పూరం సమర్పించారు.

గురుస్వాములకు ముస్లింల సన్మానం

గత ఏడాది అయ్యప్ప గ్రామోత్సవం సందర్భంగా ఏర్పడిన ఆందోళనకర పరి స్థితుల్లో ఈ ఏడాది ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగ కుండా రాయచోటి డీఎస్పీ కృష్ణ మోహన్ పర్యవేక్షణలో అర్బన్, రూరల్, లక్కిరెడ్డిపల్లె సీఐలు వెంకటాచలపతి, వరప్రసాద్, కొండారెడ్డి గట్టి బందోబస్తు నిర్వ హించారు. అయితే, గ్రామోత్సవాని పలువురు ముస్లిం పెద్దలు స్వాగతం పలకడంతో పాటు, భక్తులకు అరటి పండ్లు, నీళ్ల సీసాలు అందజేశారు. గురుస్వాములను శాలువాలతో సన్మానించి మత సామరస్యాన్ని చాటుకున్నారు.



చెక్‌పోస్టు శివాలయం నుంచి ప్రారంభమైన అయ్యప్పస్వామి గ్రామోత్సవం



పల్లకీ ఉత్సవంపై అయ్యప్పస్వామి

యువకుడు ఆత్మహత్య



మృతిచెందిన పిడుగు రెడ్డిశేఖర్

రాయచోటి, నేతాజీసర్కిల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): దురలవాట్లకు బానిసైన ఓ వ్యక్తి గురువారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్య చేసు కున్నాడు. పోలీసుల వివరాల మేరకు... వాయల్పాడు మండలం నగిరిపల్లెకు చెందిన పిడుగు రెడ్డిశేఖర్ (24) ఐదేళ్ల క్రితం వైజాగ్‌కు చెందిన ఓ మహిళతో సహజీవనం చేసేవాడు. ఆమెతో మనస్పర్థలు రావడంతో విడిపోయి మండల పరిధిలోని శెట్టిపల్లె గ్రామం ఎగులమూలపల్లెలో బంధువుల ఇంటిలో ఉంటున్నాడు. ఈ క్రమంలో చెడు అలవాట్లకు బానిసైన అతను గురువారం సాయంత్రం ఎగువ మాలపల్లెకు సమీపంలోని పొలం వద్ద చెట్టుకు ఉరివేసుకున్నాడు. అతను రాత్రి ఇంటికి రాకపోవడంతో బంధువులు చుట్టుపక్కల వెతకగా చెట్టుకు ఉరేసుకొని కనిపించాడు. దీంతో వారు శుక్రవారం పోలీసులకు సమాచారం అందించగా ఏఎస్ఐ బాదుల్లా సంఘటన స్థలానికి చేరుకొని మృతికి గల కారణాలు తెలుసుకున్నారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని గేదె మృతి



మృతిచెందిన గేదె

రామాపురం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పాతరామాపురం సమీపంలోని రైతు భరోసా కేంద్రం ఎదురుగా గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని తన గేదె మృతి చెందినట్లు చప్పిడి లక్ష్మినారాయణ తెలిపారు. రూ.70 వేలకు కొనుగోలు చేసిన గేదె ఆధారంగా కుటుంబాన్ని పోషించుకుంటున్నానని, గేదెలను మేత కోసం రోడ్డు దాటిస్తుండగా గుర్తు తెలియని వాహనం వేగంగా వచ్చి ఢీకొందని తెలిపాడు. సంబంధిత అధికారులు తనకు ఆర్థికసాయం అందించాలని ప్రభుత్వాన్ని కోరాడు.

రూ.3.45 లక్షల ఎరువులు సీజ్...!



రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ

గుర్రంకొండ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖ అనుమతులు లేకుండా రైతులకు విక్రయిస్తున్న ఎరువులను రాయచోటి వ్యవసాయశాఖ ఏడీఏ శ్రీలత సీజ్ చేశారు. పట్టణంలోని గ్రోమోర్, పుడమి, జైకిసాన్ ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ ఎరువుల దుకాణాల్లో ప్రభుత్వ అనుమతులు లేకుండా విక్రయిస్తున్న వివిధ రకాల ఎరువులు, డ్రిప్ ఎరువులను సీజ్ చేశారు. మూడు దుకాణాల్లో 11.221 మెట్రిక్ టన్నుల ఎరువులను సీజ్ చేసినట్లు తెలిపారు. అధికారులు సీజ్ చేసిన ఎరువుల విలువ రూ.3,45,603 లక్షల ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఓ రత్నమ్మ, రాజేంద్ర పాల్గొన్నారు.

యువకుడిపై హత్యాయత్నం కేసు

మదనపల్లెఅర్బన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పుంగనూరు రోడ్డు కనుమలో గంగమ్మ ఆలయం వద్ద నివాసం ఉన్న రెడ్డిశేఖర్ సొంతంగా ఆటో నడుపుతూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో చెంబకూరు రోడ్డు రాగిమాను వద్ద ఉన్న నాన్నమ్మ లక్ష్మీదేవి ఇంటికి వెళ్లేందుకు ఆటోలో రాగిమాను వద్దకు వెళ్లాడు. అక్కడ వేచి ఉన్న రెడ్డిశేఖర్‌ను వాల్మీకి వీధికి చెందిన తరుణ్ మద్యంమత్తులో బాడుగకు రావాలని అసభ్యకరంగా మాట్లాడాడు. నాన్నమ్మ కోసం వేచివున్నాను అంటుండగానే తాను పిలిస్తే రావా అంటూ తన జేబులోని చాకుతో రెడ్డిశేఖర్ గొంతు పై కోసి పరారయ్యాడు. స్థానికులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తర లించి చికిత్స అందించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు హత్యాయ త్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ తెలిపారు.

వ్యక్తిపై దాడి... పోలీసులకు ఫిర్యాదు

గుర్రంకొండ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): తన కుమారుడిపై దాడి చేసి విక్షణారహితంగా కొట్టిన వ్యక్తిపై చర్యలు తీసుకో వాలని లక్ష్మీదేవి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. నడిమిఖండ్రిగ పంచాయతీ పేరంపల్లె వాసులు పెద్దరెడ్డెప్ప, లక్ష్మీదేవి కుమారుడు ఆంజనే యులు సొంతపనుల నిమిత్తం గురువారం రాత్రి నడిమిచెర్లకు వెళ్లి వస్తుండగా వర్షం కురవడంతో మార్గమధ్యలోని ఓ రేకుల షెడ్ వద్దకు వెళ్లారు. ఈ క్రమంలో రేకుల షెడ్ యజమానికి, ఆంజనేయులకు వాగ్వాదం జరి గింది. ఈ నేపథ్యంలో రేకుల షెడ్ యజమాని ఆంజనేయులుపై దాడి చేయడంతో రక్తగాయాలయ్యాయి. గమనించిన కుటుంబ సభ్యులు బాధితున్ని 108 వాహనంలో వాల్మీకిపురం ఆస్ప త్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం తిరుపతి రూయా ఆస్పత్రికి తీసుకెళ్లారు. బాధితుని తల్లి లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు పోలీసులు విచారిస్తున్నట్లు ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు.

వర్షం... కల్లోలం

- చేతికివచ్చిన వరి పంట నీటిపాలు
- ధాన్యం ఆరక అవస్థలు ● రైతన్నల కళ్లలో కన్నీరు


చెన్నూరు : తడిచిన ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్న మహిళ


చెన్నూరు: రోడ్లపై ఆరబోసిన ధాన్యంపై పట్టలు కప్పిన దృశ్యం

ఆరుగాలం కష్టపడి వరి పంట పండించిన రైతన్నలకు దిత్వా తుఫాను కన్నీరు మిగిల్చింది. తుఫాను కారణంగా గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి చేతికి అంది వచ్చిన వరిపంట నీటి పాలైంది. ఇక ఇప్పటికే కోత కోసి కల్లాల్లో, రోడ్లపై ఆరబోసిన ధాన్యం మగ్గిపోతోంది. దీంతో ఏం చేయాలో అర్థం కాక రైతులు తలలు పట్టుకుంటున్నారు.

చెన్నూరు/అట్లూరు/చాపాడు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాను కారణంగా గత నాలుగు రోజులు నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో వరి రైతులు తీవ్రంగా నష్టపోయారు. మండలంలోని రామనపల్లె, చిన్నమాచుపల్లె, ఉప్పరపల్లె, బుడ్డాయపల్లె గ్రామాల్లో రైతులు వరికోతలు కోశారు. ధాన్యాన్ని జాతీయ రహదారి పక్కన సర్వీసు రోడ్డులో ఆరబోసుకున్నారు. వర్షం ప్రతి రోజూ కురుస్తూనే ఉండటంతో పట్టలు కప్పి ఉంచారు. అయినా ధాన్యం చుట్టూ నీరు చేరి అడుగు భాగంలో తడిచి పోయింది. అక్కడక్కడా సన్నటి మొలకలు కూడా వచ్చాయి. ధాన్యాన్ని రోజూ తెరిపి ఇచ్చినప్పుడల్లా ఆరబోసుకుంటున్నా.. పట్టలపై నీళ్లు నిలబడి ధాన్యం తడుస్తోంది. దీంతో దళారులు పుట్టి ధాన్యం 12వేలకు పైగా ఉండగా, 11వేలకు బేరమాడుతున్నారు. దీంతో ఆరుగాలం చేసిన కష్టం నీటిసమర్పణ అవుతోందని బాధను వ్యక్తం చేస్తున్నారు.

అట్లూరు మండలంలోని కొండూరు గ్రామంలో చెరువుల కింద సాగు చేసిన సుమారు 50 ఎకరాలు వరి పంట నీటి పాలు కావడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు 20వేలు రూపాయలు పెట్టుబడి పెట్టి ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతికి వచ్చే సమయంలో వర్షానికి దెబ్బతిందని వాపోతున్నారు. అలాగే మండలంలోని రెడ్డిపల్లె, కొండూరు, కుంభగిరి, వేమలూరు, తంబళ్లగొంది అట్లూరు గ్రామాల్లో వందల ఎకరాల్లో చీనీ నిమ్మ సాగు చేశారు. ఇప్పుడు పూత, పిందె దశలోని పంట ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి మగ్గి రాలిపోయి నేలపాలైంది. వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు వర్షానికి దెబ్బతిన్న పంటలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదికలు పంపి నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.


వరి ధాన్యానికి కప్పిన టార్పాలిన్ పట్ట

కల్లాల్లో మగ్గుతున్న ధాన్యం

చాపాడు మండలంలో వారం రోజుల నుంచి వరి కోతలు కోస్తున్నారు. సీతారామపురం, చాపాడు, కేతవరం, భద్రిపల్లె, విశ్వనాథపురం, అనంతపురం, నక్కలదిన్నెతో పాటు పలు గ్రామాల పరిధిలో రైతులు కేఎన్ఆర్, కేఎల్ఎం వంటి వరి రకాలను సాగు చేశారు. తక్కువ కాలపరిమితి కలిగిన పంట ప్రస్తుతం కోత దశకు రావడంతో రైతులు మిషన్లతో కోసి కల్లాల్లో, రోడ్లపై ఆరబోస్తున్నారు. అయితే తుఫాను కారణంగా మూడు రోజులుగా వర్షం కురుస్తుండడంతో ధాన్యాన్ని కాపాడుకునేందుకు టార్పాలిన్ పట్టలు కప్పారు. దీంతో ధాన్యానికి గాలి, ఎండ తగలక మగ్గుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

నేల తల్లిని కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత

సీకేదిన్నె, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నేలతల్లిని కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఊటుకూరులో శుక్రవారం ఆచార్య ఎన్జీరంగ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ పరిశోధనస్థానం ఆధ్వర్యంలో అంతర్జాతీయ నేలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్యవంతమైన నేలను కాపాడుకుంటూ మన భావితరాలకు సాధ్యమైనంత నేలను అందించడం, సేంద్రియ వ్యవసాయం, జీవన ఎరువులు, జీవ శిలీంద్రాలు ప్రాముఖ్యతను వివరించి రైతుల్లో అవగాహన కల్పించాలన్నారు. నేలల శాస్త్రవేత్త యాస్మిన్ నేల యొక్క ప్రాముఖ్యత, పంటలకు కావాల్సిన స్థూల, సూక్ష్మ పోషకాల ఆవశ్యకతను గురించి వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ కొర్రపాటి సునీల్‌కుమార్, సుబ్రహ్మణ్యం, డాక్టర్ వాకా మాధురి, డాక్టర్ శ్రీవల్లి, అగ్రికల్చరల్ విద్యార్థులు పాల్గొన్నారు.

దేశ ప్రయోజనాల కోసం జ్ఞానం ఉపయోగపడాలి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కాశీలింగం

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): యువత జ్ఞానం దేశ ప్రయోజనాల దిశగా వినియోగం అయితే భారత్ పురోగతి సాధిస్తుందని పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీ మేనేజ్‌మెంట్ స్టడీస్ హెడ్ ప్రొఫెసర్ ఆర్.కాశీలింగం అభిప్రాయపడ్డారు. శుక్రవారం ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగిన క్రాస్ ఫంక్షనల్ మేనేజ్‌మెంట్ అనలిటిక్స్ ఫర్ బిజినెస్ సక్సెస్ జాతీయ వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లాగే అభివృద్ధి చెందుతున్న సాంకేతికతను యువత అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం ఫైనాన్షియల్ అనలిటిక్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మానవ వనరుల అనలిటిక్స్‌పై హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ పి.మురుగన్ మాట్లాడారు. వైసీఎం విజయు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్, స్కూల్ ఆఫ్ కామర్స్, లా అండ్ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ వై.సుబ్బరాయుడు, డాక్టర్ టి.చంద్రశేఖర్ తదితరులు వర్క్‌షాప్ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమాన్ని కన్వీనర్ డాక్టర్ పి.సరిత నిర్వహించగా, బీఓఎస్ ఛైర్మన్ డాక్టర్ గంగయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దొంగతనం కేసులో ముగ్గురు అరెస్టు

4.5 గ్రాములు బంగారు చైను, స్కూటీ స్వాధీనం

కడప క్రైం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో ఇటీవల తాళాలు వేసిన ఇళ్లలో చోరీకి పాల్పడుతున్న ముగ్గురు దొంగలను గురు వారం పాత బైపాస్ వద్ద పోలీసులు అరెస్టు చేశారు. చిన్నచౌకు సీఐ ఓబులేసు వివరాల మేరకు.. కడప నగరం మృత్యుంజయకుంటకు చెందిన ఉదయగిరి పెద్దకుళాయప్ప అలియాస్ లడ్డు, శంకరాపురానికి చెందిన ఇద్దరు మైనర్లతో కలిసి ఎర్రముక్కపల్లె ఏపీహెచ్‌బీ కాలనీ, కడప శంకరాపురంలో తాళాలు వేసిన ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడ్డారు. దొంగలించిన బంగారు చైనును విక్రయించేందుకు బైపాస్‌లో వెళుతు న్నట్లు సమాచారం రావడంతో ఎస్ఐలు రాజరాజేశ్వర్‌రెడ్డి, రవికుమార్, సిబ్బందితో నిఘా ఉంచి పెద్ద కుళాయప్పతో పాటు ఇద్దరు మైనర్లను అరె స్టు చేసినట్లు సీఐ తెలిపారు. నిందితుల నుంచి 4.5 గ్రాముల బంగారు చైను, స్కూటీ, సెల్‌ఫోనును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మైన ర్లను జువైనల్ హోంకు తరలించినట్లు తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : చోరీల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ ఓబులేసు తెలిపారు. ఎవరైనా ఇల్లు వదిలి ఇతరప్రాంతాలకు వెళ్లాల్సి వస్తే.. విలువైన వసువ్తులను బ్యాంకు లాకరులో కానీ నమ్మకమైన వ్యక్తుల వద్ద భద్రపరుచుకోవాల న్నారు. ఊర్లకు వెళ్లే సమయంలో తక్షణమే సంబంధిత పోలీసులకు సమాచారం అందిస్తే ఆఇంటిపై నిఘా ఉంచుతామన్నారు. ప్రజలు స్వచ్ఛంధంగా ఇళ్లలో, దుకాణాల్లో ప్రధాన వీధుల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే చోరీ చేసిన వారిని గుర్తించవచ్చని అన్నారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన అవసరం


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ నెల్సన్

కడపసెవెన్ రోడ్స్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన అవసరమని డాక్టర్ నెల్సన్ వినోద్ మోసెస్ పేర్కొన్నారు. ఇటీవల విద్యార్థుల్లో కనిపిస్తున్న ఒత్తిడి, ఆందోళన, నిరాశ వంటి సమస్యలు ఆత్మహత్యా ప్రవృత్తులకు దారి తీస్తున్న నేపథ్యంలో శుక్రవారం కడప రిమ్స్ వైద్య కళాశాలలో నేషనల్ మెడికల్ కౌన్సిల్, డాక్టర్ ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఆదేశాల మేరకు వైద్య విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బెంగుళూరు నుంచి వచ్చిన డాక్టర్ నెల్సన్ వినోద్ మోసెస్ ప్రధాన వక్తగా పాల్గొని మెడికల్ చదివే యువత ఎక్కువ సమయం అకడమిక్ ఒత్తిడిలో గడపడం వల్ల వారి భావోద్వేగ సహనశక్తి దెబ్బతింటుందన్నారు. అలాంటి పరిస్థితుల్లో చిన్న సమస్యలు కూడా పెద్దవిగా అనిపించవచ్చని వివరించారు. విద్యార్థులు తమ భావోద్వేగాలను అణచివేయకుండా ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు లేదా నిపుణులతో పంచుకుంటే సమస్యల పరిష్కారం త్వరగా లభిస్తుందని సూచించారు. విద్యార్థుల్లో సాధారణంగా కనిపించే ఒత్తిడి లక్షణాలు, ఎమోషనల్ అసెస్‌మెంట్ పద్ధతులు, ఆత్మహత్య ఆలోచనలను ముందుగానే గుర్తించే సూచికలు, ప్రమాదంలో ఉన్న విద్యార్థులకు క్లాస్‌మేట్స్ ఎలా సహాయం చేయాలి, కాలేజ్ ఆధ్వర్యంలో అందుబాటులో ఉన్న కౌన్సెలింగ్ సదుపాయాల గురించి నిపుణులు వివరించారు. చిన్నపాటి ఆందోళనలను కూడా నిర్లక్ష్యం చేయకూడదని, అవి పెద్ద సమస్యలకు దారి తీయవచ్చని హెచ్చరించారు. సమస్యలు ప్రతి ఒక్కరి జీవితంలో వస్తాయి.. వాటిని దాచిపెట్టకుండా సరైన సమయంలో సహాయం తీసుకుంటే ఏ పరిస్థితినైనా అధిగమించవచ్చని సూచించారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డాక్టర్ జమున, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కళ్యాణి, సైకియాట్రి విభాగాధిపతి డాక్టర్ వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలకు ఆర్థిక తోడ్పాటు అందించాలి



పీఆర్ కమిషనర్ కృష్ణ తేజను కలిసిన శివచంద్రారెడ్డి

ప్రొద్దుటూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలకు గృహ, గృహేతర నిర్మాణాలకు అనుమతులు ఇచ్చే అధికారం ఇవ్వాలని సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు కొనిరెడ్డి శివ చంద్రారెడ్డి కోరారు. శుక్రవారం రాజధాని అమరావతిలో పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణ తేజను శివచంద్రారెడ్డి కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీల్లో నిధుల లేమితో అభివృద్ధి పనులు చేపట్టలేకపోతున్నామన్నారు. కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ అధికారులు పంచాయతీల అనుమతులు లేకుండా ఇష్టానుసారం గ్రామాల్లో గృహ నిర్మాణాలకు, వాణిజ్య గృహాలకు అనుమతులు ఇస్తున్నారన్నారు. ఇది గ్రామ పంచాయతీ అధికారాలను కబ్జా చేయడమేనన్నారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ డిపార్ట్‌మెంటు నుంచి కూడా పంచాయతీలకు రావాల్సిన నిధులు విడుదల చేయించాలన్నారు. కుడా ఇచ్చిన పర్మిషన్లతో వచ్చిన నిధులను కూడా పంచాయతీలకు ఇవ్వడం లేదన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు సైతం విడుదల చేయాలని కోరారు. ఇందుకు కమిషనర్ కృష్ణ తేజ సానుకూలంగా స్పందించి నిధులు విడుదల కోసం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


నాగేశ్వర్‌రెడ్డి (ఫైల్ ఫొటో)

సింహాద్రిపురం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బలపనూరు గ్రామానికి చెందిన బూతునూరు నాగేశ్వరరెడ్డి(60) అనే రైతు అప్పుల బాధతో శుక్రవారం చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మ హత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ రవికుమార్ సమాచారం మేరకు నాగేశ్వరరెడ్డి తనకు ఉన్న 5 ఎకరాల పొలంలో వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునే వాడు. ఈ నేపథ్యంలో పంట దిగుబడులు సరిగా రాకపోవడం, ధరలు లేకపోవడంతో అప్పులు చేయాల్సి వచ్చింది. దీనికితోడు మృతుని భార్య క్యాన్సర్ వ్యాధితో బెంగుళూరు ఆస్పత్రిలో పొందుతోంది. చికిత్స కోసం ఖర్చులు భరాయించాల్సి రావడంతో మనస్థాపానికి గురైన నాగేశ్వరరెడ్డి గ్రామంలోని ఎస్సీ కాలనీ దగ్గర చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి ఇద్దరు కొడుకులు, ఒక కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పులివెందుల ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించి, మృతుడి కుమారుడు నాగవర్ధన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అయ్యప్ప భక్తుడు మృతి


సాయిచంద్ర (ఫైల్)

మైదుకూరు డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మైదుకూరుకు చెందిన కశెట్టి సాయిచంద్ర (29) అయ్యప్ప మండల దీక్షను పూర్తిచేసి డిసెంబరు 1న సోమవారం ఇరుముడితో శబరిమల యాత్రకు బయలుదేరారు. అయ్యప్ప దర్శనం అనంతరం తిరుగు ప్రయాణంలో శుక్రవారం తెల్లవారు జామున కన్యాకుమారి వద్ద శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడుతుండడంతో సహచర భక్తులు తిరునల్వేలి ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఒక్కగానొక్క కుమారుడైన సాయిచంద్ర మృతి వార్త తెలిసిన తల్లిదండ్రులు జయమ్మ, లక్ష్మీనరసయ్యలు బోరున విలపిస్తున్నారు. శరణం అయ్యప్పా అంటూ నీదర్శనం కోసం వస్తే.. నా కుమారుడికి మరణం ప్రసాదించావా... మేమేం పాపం చేశాం అంటూ రోధిస్తున్నారు.

ఏపీఎస్పీ బెటాలియన్ డీఎస్పీ మృతి

- అక్కివారిపల్లెలో విషాదఛాయలు


వెంకటరెడ్డి (ఫైల్)

కలసపాడు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్పీ బాకరాపేట 11వ బెటాలియన్‌లో డీఎస్పీగా పనిచేస్తున్న కందుల వెంకటరెడ్డి శుక్రవారం ఉదయం అకస్మికంగా మృతి చెందాడు. దీంతో ఆయన స్వగ్రామమైన కలసపాడు మండలం అక్కివారిపల్లెలో విషాద ఛాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన వెంకటరెడ్డి సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్‌గా ఎంపికై అనంతరం ఏపీఎస్పీలో ఆర్ఎస్ఐగా, సివిల్ ఎస్ఐ గా, సీఐగా, డీఎస్పీగా పదోన్నతి పొందారు. ప్రస్తుతం బాకరాపేట సమీపంలోని ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లో అసిస్టెంట్ కమాండెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఉదయం గుండెపోటుతో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

తమ్మునిపై అన్న దాడి... తీవ్రగాయాలు


చికిత్స పొందుతున్న నాగసుబ్బరాయుడు

బి.కోడూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పొలం గట్టు విషయమై తమ్మునిపై అన్న పారతో దాడి చేయడంతో తీవ్ర రక్తగాయాలైన సంఘటన శుక్రవారం బికోడూరు మండలంలో చోటు చేసుకుంది. వివరాలిలా.. పెదుళ్లపల్లె గ్రామానికి చెందిన నాగయ్యకు ఇద్దరు భార్యలు. మొదటి భార్యకు ఒక కుమారుడు కాగా ఆమె అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో రెండో వివాహం చేసుకున్నాడు. ఆమెకు ఒక కుమా రుడు, కూతురు. మొదటి భార్య కుమారుడు సుబ్రహ్మణ్యం బతుకు దెరువు కోసం గల్ఫ్‌కు వెళ్లాడు. గురువారం రాత్రి అతను గల్ఫ్ నుంచి వచ్చాడు. శుక్రవారం ఉదయం పొలం వద్దకు వెళ్లగా.. అప్పటికే తన తమ్ముడు నాగసుబ్బరాయుడు తల్లితో కలిసి వరి నాటేందుకు పొలం వద్ద ఉన్నాడు. ఈ సమయంలో గట్టు చెక్కే విషయంమై అన్నదమ్ములు ఘర్షణ పడ్డారు. దీంతో కోపోద్రిక్తుడైన అన్న సుబ్రహ్మణ్యం తమ్ముడి చేతిలోని పార తీసుకుని అతనిపై దాడి చేసి విచక్షణారహితంగా నరికాడు. దీంతో నాగసుబ్బరాయుడుకు తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని గ్రామస్థుల సాయంతో బద్వేలు ప్రభుత్వ ఆసుపత్రికి.. మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. బద్వేలు సీఐ క్రిష్ణయ్య, ఏఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి సిబ్బందితో అక్కడికి చేరుకుని సుబ్రహ్మణ్యంను అరెస్టు చేసి విచారిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

కొండాపురం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏటూరు-అనంతపురం గ్రామాల మధ్య నేషనల్ హైవేపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి గాయలయ్యాయి. మండలంలోని బుక్కపట్నం గ్రామానికి చెందిన అనిల్‌కుమార్ అనే యువకుడు బైక్‌పై పులివెందులకు వెళుతుండగా అదుపుతప్పి నిలబడి ఉన్న లారీని ఢీకొంది. ఈ సంఘటనలో అనిల్‌కుమార్ తలకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 వాహనంలో తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

యువకుడు అదృశ్యం



మైదుకూరు డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బద్వేలు రోడ్డు గాంధీనగర్‌కు చెందిన ఇర్ఫాన్ (22) అనే యువకుడు ఇంటి వద్ద నుంచి వెళ్లి అదృశ్యమైనట్లు అతని తండ్రి జంగ్లీబాయ్ ఖదీర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ రమణారెడ్డి తెలిపారు. ఆచూకీ తెలిసినవారు 9121100618 కు సమాచారం ఇవ్వాలన్నారు.

డ్రాగా ముగిసిన క్రికెట్ మ్యాచ్‌లు


కేపీ శ్రీరామ్, రతన్, రాజ్

కడప స్పోర్ట్స్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కడపలో వివిధ జట్ల మధ్య సాగుతన్న ఏసీఏ అండర్-14 ఇంటర్ జోనల్ రెండు రోజుల క్రికెట్ మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. ఏసీఏ క్రికెట్ స్టేడియంలో రెస్ట్ ఆఫ్ నార్త్‌జోన్-నార్త్‌జోన్ విన్నర్స్ జట్ల మధ్య సాగిన మ్యాచ్‌లో రెస్ట్‌ఆఫ్‌నార్త్‌జోన్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో కేవలం 55.2 ఓవర్లలోనే 111 పరుగులకు చేతులెత్తేసిన సంగతి తెలిసిందే. నార్త్‌జోన్ విన్నర్స్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో ఆట ముగిసే సమయానికి 9 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 27 పరుగులు చేసింది. రెండవ రోజైన శుక్రవారం తిరిగి బ్యాటింగ్‌కు దిగి 84.3 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 203 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఇందులో కె.పి.శ్రీరామ్ 103 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. బౌలింగ్ విభాగంలో రెస్ట్‌ఆఫ్ నార్త్ జోన్ జట్టు బౌలర్ రతన్ 5 వికెట్లు సాధించారు. దీంతో నార్త్ జోన్ విన్నర్స్ జట్టుకు 92 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. దీంతో రెస్ట్ ఆఫ్‌నార్త్‌జోన్ జట్టు రెండో ఇన్నింగ్స్‌కు దిగి ఆట ముగిసే సమాయానికి 12 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 44 పరుగులు చేసింది. దీంతో మ్యాచ్‌ను డ్రాగా ముగిసినట్లు వెల్లడించారు.

కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో రెస్ట్ ఆఫ్ సౌత్‌జోన్- రెస్ట్‌ఆఫ్ సెంట్రల్‌జోన్ జట్ల మధ్య సాగిన మరో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్‌ఆఫ్ సౌత్‌జోన్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 55 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 165 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. వెలుతురు సరిగా లేని కారణంగా ఆటను నిలుపుదల చేశారు. రెండవ రోజైన శుక్రవారం బ్యాటింగ్ చేపట్టి 77 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 221 పరుగులు చేసింది. ప్రతిగా బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్ ఆఫ్ సెంట్రల్‌జోన్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో ఆట ముగిసే సమయానికి 76 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 317 పరుగులు చేసింది. ఇందులో రాజ్ 139 పరుగులు చేశారు. దీంతో రెస్ట్‌ఆఫ్‌సెంట్రల్‌జోన్ జట్టుకు 96 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. కాగా నిర్వా హకులు మ్యాచ్‌ను డ్రాగా ముగిసినట్లు వెల్లడించారు.

కేఆర్ఎం క్రికెట్ మైదానంలో సెంట్రల్ జోన్ విన్నర్స్-సౌత్‌జోన్ విన్నర్స్ జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన సౌత్‌జోన్ విన్నర్స్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 22.5 ఓవర్లలో ఎట్టకేలకు 91 పరుగుల వద్ద ఆలౌట్ అయ్యింది. బౌలింగ్ విభాగంలో సెంట్రల్‌జోన్ విన్నర్స్ బౌలర్ వికేష్ 5 వికెట్లు పడగొట్టారు. ప్రతిగా బ్యాటింగ్‌కు దిగిన సెంట్రల్‌జోన్ విన్నర్స్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 58 ఓవర్లలో 210 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో సెంట్రల్ జోన్ విన్నర్స్ జట్టుకు 119 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. అనంతరం రెండవ ఇన్నింగ్స్‌కు దిగిన సౌత్‌జోన్ విన్నర్స్ జట్టు ఆట ముగిసే సమయానికి 28 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 151 పరుగులు చేసింది. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది.

కాశీ తమిళ సంఘమం బృందానికి స్వాగతం

దువ్వూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతకుంట వద్ద శుక్రవారం వారణాశికి వెళుతున్న కాశీ తమిళ సంఘమం బృందానికి జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ స్వాగతం పలికారు. డిసెంబరు 2న బయల్దేరిన ఈ యాత్ర 15వ తేదీకి వారణాశికి వెళ్లనుంది. ఈ మేరకు సభ్యులకు ఆర్డీవో సాదరంగా స్వాగతం పలికారు. టెన్‌కాశీ నుంచి 40 మంది సభ్యులు మినీ బస్సుల్లో ఇక్కడికి చేరుకున్నారు. 14 రోజుల పాటు ఈ యాత్ర కొనసాగుతుందని వారి బృంద సభ్యుడు రమేష్‌శెట్టియార్ తెలిపారు. స్వాగతం పలికిన వారిలో ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున, తహసీల్దారు సంజీవరెడ్డి, ఆర్ఐ జాన్సన్ ఉన్నారు.

అనంత, కడప దేవదాయ అధికారుల మార్పు

అమరావతి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): దేవదాయశాఖ రాష్ట్రంలోని ఇద్దరు జిల్లా శాఖ అధికారులను మార్చింది. కడప జిల్లా ఎండోమెంట్ అధికారి పి.మల్లికార్జున ప్రసాద్‌ను అనంతపురం జిల్లాకు అదే స్థానంలో బదిలీ చేసింది. అలాగే అల్లాడుపల్లి వీరభద్రస్వామి దేవస్థానం ఈవో సి.శంకర బాలాజీకి కడప జిల్లా దేవదాయశాఖ అధికారిగా అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ ఉత్తర్వులను వెంటనే అమలు చేయాలని దేవదాయ శాఖ కమిషనర్‌ను ఆదేశిస్తూ, ఆ శాఖ కార్యదర్శి హరిజవహర్‌లాల్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

రాజంపేటను జిల్లా కేంద్రం చేయకుంటే ఉద్యమాలు ఉగ్రరూపం





రైల్వేకోడూరు, రాజంపేట, చిట్వేలిలో ఆందోళన చేస్తున్న ముస్లింలు, రాజంపేట జిల్లా కేంద్రం సాధన సమితి సభ్యులు

రైల్వేకోడూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాజంపేటను జిల్లా కేంద్రంగా చేయకుంటే ఉద్యమాలు ఉగ్రరూపం దాలుస్తాయని జేఏసీ నాయకుడు డాక్టర్ సయ్యద్ హెచ్చరించారు. శుక్రవారం రైల్వేకోడూరు పట్టణంలోని మసీదు నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం రాజకీయ స్వార్థంతో రాయచోటిని జిల్లా కేంద్రం చేసిందన్నారు. ప్రస్తుతం రాజంపేటకు జిల్లా కేంద్రం సాధనకు అన్ని వర్గాలు పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపు నిచ్చారు. అనంతరం తసీల్దార్ కోనేటి అమర్‌నాథ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మసీదు కమిటీ అధ్యక్షుడు ముజీబ్, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ పఠాన్ మౌలా, మస్తాన్, జుబేర్, వైఎస్ కరీముల్లా, రవూఫ్, జనసేన నాయకులు మర్రిరెడ్డి ప్రసాద్ పాల్గొన్నారు.

రాజంపేట టౌన్ : పట్టణంలోని ముస్లింలు శుక్రవారం మధ్యాహ్నం రాజంపేట జిల్లా సాధన సమితి జేఏసీ ఆధ్వర్యంలో పాతబస్టాండు కూడలిలో మానవహారం నిర్వహించారు. నాలుగు రోడ్ల కూడలిలో రోడ్లపై బైఠాయించారు. అన్ని అర్హతలున్న జిల్లా కేంద్రం చేయాలి అంటూ నినాదాలు చేశారు. మైనార్టీ నాయకులు అబూబకర్, షేక్ షామీర్‌బాషా, కరీం, జే లక్ష్మీనారాయణ, మర్రి రవి, ప్రైవేటు పాఠశాలల సంఘం అధ్యక్షుడు అబ్బారు ప్రభాకర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చిట్వేలి : చిట్వేలి జేఏసీ ఆధ్వర్యంలో ముస్లింలు, స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఆర్ఐ రామ్మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. గత ఎన్నికల సందర్భంగా నాయకులు ఇచ్చిన హామీని నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు.

భుజంగేశ్వరాలయ హుండీ కానుకల లెక్కింపు

రైల్వేకోడూరురూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భుజంగేశ్వరాలయ హుండీలోని కానుకలను శుక్రవారం లెక్కించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ ఉంగరాల సురేంద్ర కుమార్ (చిన్నా) మాట్లాడుతూ హుండీలోని కానుకల ద్వారా ఆలయానికి రూ. 5,30,736 ఆదాయం వచ్చినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ఎన్. వెంకటసుబ్బారెడ్డి, అర్చకుడు బోయలకుంట్ల పవన్‌కుమార్‌శర్మ, ధూర్జటి యోగి, ఆలయ కమిటీ సభ్యులు డి. సాయికుమార్, టీ. నీలాకృష్ణ, ఏ. నాగబాలాజీ, అటెండర్ వై. హరినాథ్, భక్తులు ఇ. శంకర్ పాల్గొన్నారు.

గంగమ్మకు సారె సమర్పణ

పెనగలూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : సింగనమల చెరువులో శుక్రవారం సాయంత్రం సింగనమల నీటిసంఘం అధ్యక్షుడు గూడూరు సుబ్బరాయుడు గంగమ్మకు సారె సమర్పించా. ఈ చెరువుకు సాగునీరు అందించే అత్తాకోడళ్ల కాలువ నిర్మించిన వారి వంశస్థుడు గుడ్ల వీర నారాయణ రెడ్డి చీర, రవిక, పసుపు కుంకుమ, పూలు, పండ్లు, గాజులు తదితరాలను చెరువు నీళ్లల్లో వదిలి పెట్టారు. సింగనమల సర్పంచ్ ఎర్రి శివయ్య, పొందలూరు నీటిసంఘం అధ్యక్షుడు మారంరెడ్డి పెంచలయ్య, జి.ఈశ్వరయ్య, ఎం.లక్ష్మీనరసయ్య తదితరులు పాల్గొన్నారు.

పెనగలూరు టీడీపీ అబ్జర్వర్‌గా భగవాన్ సహాయరెడ్డి



సుండుపల్లె, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రైల్వే కోడూరు నియోజకవర్గం పెనగలూరు మండల అబ్జర్వర్‌గా రాజంపేట పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు యనమల భగవాన్ సహాయరెడ్డిని నియమించినట్లు శుక్రవారం టీడీపీ నాయకులు తెలిపారు. పెనగలూరు మండలంలోని క్లస్టర్ 011లో 221, 222, 223, 224 కేంద్రాలకు ఆయనను అబ్జర్వర్‌గా నియమించారు తన నియామకానికి కృషి చేసిన నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

వర్షానికి కూలిన ఇంటి గోడలు

రైల్వేకోడూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ధర్మాపురానికి చెందిన చంగయ్య నివసిస్తున్న రేకుల ఇంటి గోడలు శుక్రవారం కూలిపోయాయి.ఆ సమయంలో ఇంటిలో ఎవరూ లేక పోవడంతో ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న సర్పంచ్ బుడిగి శివయ్య, బోళా శంకర్ సేవా సమితి అధ్యక్షుడు మండల నాగేంద్ర బాధితులను పరామర్శించారు.

నేడు రైతు బజారుకు శంకుస్థాపన

చిన్నమండెం, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో రైతుబజారు నిర్మాణ పనులకు శనివారం ఉదయం 10 గంటలకు మంత్రి మండిపల్లి సతీమణి హరిత భూమిపూజ చేయనున్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల అధ్యక్షుడు రెడ్డెప్ప పిలుపునిచ్చారు.

PUBLIC NOTICE

ఈ PUBLIC NOTICE ద్వారా ప్రజలకు తెలియజేయడమేమనగా Smt. Laddagiri Pavani W/o L. Narasimha Prasad గారు Anantharajapuram Village fields, Kuchivaripalli Grama Panchayat, Rajampeta Mandal, Annamayya Districtలో ఉన్న క్రింది A-Schedule మరియు B-Schedule ప్రాపర్టీల యజమాని. పై ప్రాపర్టీల విషయంలో Hon'ble Principal Junior Civil Judge Court, Rajampeta నందు O.S.No. 95/2025గా ప్రధాన సూట్ పెండింగ్‌లో ఉంది. దానిలో దాఖలైన I.A. No. 192/2021లో కోర్టు ఆదేశాలు (Injuction Order) అమల్లో ఉన్నందున, ఎవరి ద్వారా అయినా కొనుగోలు, అమ్మకం, హక్కుల బదలీ, నిర్మాణం, ఆక్రమణ, పెట్టు బడి, కంచె వేయడం లేదా ఇతర ఏ విధమైన లావాదేవీలు పూర్తిగా నిషేధించబడ్డవి. ఈ కోర్టు ఆదేశాలను అతిక్ర మించినపక్షంలో సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు మరియు Contempt of Court ప్రకారం శిక్షార్హ చర్యలు తీసుకోబడును.

Schedule

A-Schedule Property, Kadapa District Now Annamaiah District, Rajampeta Sub-District, Kuchivaripalli Grama Panchayat, Sarcar Punji S.No. 9/2B-3A to an extent of Ac. 1.00 cents out of Ac. 0.33 cents or 0.132 Hectors out land bounded with East - Rastha, West - Land of A.S. Radha Krishna, North-Land of Subbaiah, South - Rastha. B-Schedule Property, Kadapa District, now Annamaiah District Rajampeta Sub-District, Kuchivaripalli Grama Panchayat, Sarcar Punji S.No. 9/2B-3A to an extent of Ac. 1.00 cents out of Ac. 0.33 cents or 0.132 Hectors out land bounded with East - Rashta, West - Land of A.S. Radha Krishna, North-Land of Chundu Venkata Ramana, South - Land of Plaintiff i.e. - Ac. 0.33 cents

ప్రజలు మోసపోకుండా ఉండేందుకు మరియు అక్రమ లావాదేవీలు జరగకుండా నిరోధించేందుకు ఈ బహిరంగ ప్రకటన జారీ చేయబడుచున్నది.

B. SURESH KUMAR, Advocate, Kadapa.

Cell : 94905 51175

పాలనా సౌలభ్యం కోసమే భవనాల నిర్మాణం

● మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



భూమిపూజ చేస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి నేతాజీ సర్కిల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పరిపాలన సౌలభ్యం కోసం పలు గ్రామ పంచాయతీలకు కార్యాలయ భవనాలను మంజూరు చేసినట్లు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పెద్దబిడికీలో గ్రామ పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణ పనులకు ఆయన భూమిపూజ చేశారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నరసారెడ్డి, డీపీవో రాధమ్మ, డ్వామా పీడీ వెంకటరత్నం, ఎంపీడీవో వెంకటసుబ్బారెడ్డి, తహసీల్దార్ సుబ్రమణ్యంరెడ్డి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 32 లక్షల రూపాయలతో ఈ భవన నిర్మాణం పనులను చేపడుతున్నట్లు తెలియజేశారు. ఇందులో 25 లక్షలు పంచాయతీరాజ్‌శాఖ నిధులు కాగా ఏడు లక్షల రూపాయలు మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ నిధులు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు.

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించుకుందాం

రాయచోటిటౌన్: డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం లక్ష్యమని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. రెవల్యూషనరీ స్టూడెంట్స్ ఫోరం (ఆర్ఎస్ఎఫ్) ముద్రించిన ఓ యువతా డ్రగ్స్ లేని సమాజం కోసం పాటుపడతాం అనే పోస్టర్‌ను శుక్రవారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించుకోవడంలో యువత భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తున్న ఫోరంను అభినందించారు. ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డీఎం ఓబులేసుయాదవ్, రాష్ట్ర పీడీఎస్‌యూ ఉపాధ్యక్షుడు ఎం. అంకన్న, వెంకటేశ్‌యాదవ్, రెడ్డి సాయి తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి : చమర్తి



చమర్తికి వినతిపత్రం సమర్పిస్తున్న చేనేత కార్మికులు

సిద్దవటం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. మండలంలోని మాధవరం, పార్వతిపురం, వెంకటేశ్వరపురం తదితర ప్రాంతాల్లో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత మగ్గాల గుంతల్లో వర్షపు నీరు చేరడంతో దాదాపు 600 కుటుంబాలకు పైగా కార్మికులు జీవనోపాది కోల్పోయారన్నారు. వారి సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ఆర్థికసాయం మంజూరు చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ప్రసాద్‌బాబు, మండల టీడీపీ అధ్యక్షుడు రాజశేఖర్, రాష్ట్ర దూదేకుల సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ వీరభద్రుడు, వాణిజ్య విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి గంజి సుబ్బరాయుడు, ఒంటిమిట్ట జడ్పీటీసీ ముద్దు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పార్టీ లైను దాటితే కఠినచర్యలు

రాజంపేట: టీడీపీ కార్యకర్తలు అధిష్ఠానం ఆదేశాలను ఉల్లంఘించి ఇతర కార్యక్రమాలు నిర్వహిస్తే కఠినచర్యలు తప్పవని రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు హెచ్చరించారు. శుక్రవారం రాజంపేట టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అద్దెపల్లె ప్రతాపరాజు, ఒంటిమిట్ట జడ్పీటీసీ ముద్దు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. రాజంపేట టీడీపీ కార్యాలయంలో చమర్తి ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించి వాటిని వెనువెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

'సమస్యలను గుర్తించి పరిష్కరించండి'

చిట్వేలి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : తుపాను ప్రభావంతో మండలంలో తలెత్తిన సమస్యలను పరిష్కరించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని రాష్ట్ర ఖాదీ విలేజ్ ఇండస్ట్రియల్ చైర్మన్ కేకే చౌదరి అధికారులకు సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. వరదలు వచ్చినప్పుడు అనుంపల్లె, ఎం.రాజుపల్లె వద్ద కల్వర్టుపై నీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడిందని, ఈ సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో వసతులపై ఆరా తీశారు. అనంతరం ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తహసీల్దారు స్పందనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామాలయం నిర్మాణానికి నిధులు మంజూరు చేయండి

సుండుపల్లె, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): రామాలయం నిర్మాణానికి టీటీడీ శ్రీవాణి భజన మండపం పథకం కింద నిధులు మంజూరు చేయాలని తోటి మాలపల్లె గ్రామస్థులు దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ విశ్వనాథ్ కు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. సుండుపల్లె పర్యటనకు వచ్చిన ఆయన గ్రామస్తులతో కలిసిఆలయ ప్రాంగణాన్ని పరిశీలించారు. నిధులకోసం ప్రతిపాదనలు పంపుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవితేజ, పాల రెడ్డెయ్య తదితరులు పాల్గొన్నారు.

భోజనశాల నిర్మాణానికి విరాళాలు

పెనగలూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చక్రంపేట ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల సహకారంతో నిర్మిస్తున్న భోజనశాల నిర్మాణానికివిద్యార్థుల తల్లిదండ్రులు విరాళాలు అందజేశారు. శుక్రవారం పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశంలో సాంఘికశాస్త్ర ఉపాధ్యాయుడు కె.సుదర్శనం రూ.5 వేలు, విద్యార్థుల తల్లిదండ్రులు రూ.30 వేలు విరాళాన్ని ప్రధానోపాధ్యాయుడు లేబాకు గోపాలకృష్ణకు అందజేశారు.

ప్రశాంతంగా మండల సర్వసభ్య సమావేశం

చిన్నమండెం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి):స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ సుధామాధురి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో పారిశుధ్యం, మంచినీరు, విద్య, వైద్యం, వ్యవసాయం, విద్యుత్, అంగన్వాడీ, ఉపాధి, రెవెన్యూ తదితర అంశాలపై చర్చ సాగింది. వర్షాల ప్రభావంతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రజాప్రతినిధులు, అధికారులు చూసుకోవాలని సమావేశం తీర్మానించింది. ఈ కార్యక్రమానికి జెడ్పీటీసీలు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమన్వయంతోనే విద్యార్థుల భవిష్యత్తు



లక్కిరెడ్డిపల్లె:విద్యార్థులకు జ్ఞాపిక అందజేస్తున్న లక్ష్మీప్రసాద్‌రెడ్డి



రాజంపేట మెమెంటోలు అందజేస్తున్న పోతుగుంట

రాయచోటి నేతాజీ సర్కిల్, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమన్వయంతోనే విద్యార్థుల భవిష్యత్తు సాధ్యమని జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) రాధమ్మ, రాష్ట్ర పాల ఏకరి కార్పొరేషన్ చైర్మన్ నాగేశ్వర్‌నాయుడు, ఎంపీడీవో వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. శుక్రవారం సంబేపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మెగా పేరెంట్స్ డే సమావేశంలో వారు మాట్లాడారు. సంబేపల్లె సర్పంచ్ అంచల రామచంద్ర, ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ పాల్గొన్నారు.

రాజంపేట : మండలంలోని బోయనపల్లె ఉన్నత పాఠశాలలో రాజంపేట టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు పాల్గొన్నారు. వివిధ పోటీల విజేతలకు మెమెంటోలు అందజేశారు. పాఠశాల వ్యవస్థాపకుడు జానపాటి బాలయానాదయ్య, ఏఎంసీ చైర్మన్ గన్నే సుబ్బనరసయ్యానాయుడు తదితరులు పాల్గొన్నారు. రాజంపేటలోని బాలికోన్నత పాఠశాలలో శ్రీశైలం దేవస్థానం చైర్మన్ పోతుగుంట రమేశ్ నాయుడు పాల్గొన్నారు. వివిధ పోటీ విజే తలకు మెమెంటోలు అందజేశారు. తహసీల్దారు పీర్ మున్నీ, ప్రధానోపాధ్యాయులు జయ లక్ష్మీ, పాఠశాల చైర్మన్ లత, పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లె: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో రాయచోటి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ టెన్త్, ఇంటర్మీడియట్‌లో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు నగదు బహుమతులు ఇస్తామన్నారు విద్యార్థులు జాతీయ స్థాయి క్రీడల్లో పాలొనేందుకు తమవంతు ప్రోత్సహిస్తామన్నారు. ప్రిన్సిపాల్ వరాల రమేశ్, మండల టీడీపీ అధ్యక్షుడు యనమల మదన్‌మోహన్, మార్కెట్ యార్డు చైర్మన్ షఫీనాయక్, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ విశ్వనాథ పాల్గొన్నారు.

వర్షం నుంచి తేరుకోని కోడూరు

రైల్వేకోడూరు, డిసెంబరు 5(ఆంధ్ర జ్యోతి): దిత్వా తుఫాన్ కారణంగా ఏడు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో రైల్వేకోడూరు నియోజకవర్గం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.. గుంజన, ముష్టేరు, గుండాలేరు, మేకల గుంతేరు తదితర నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. రైల్వేకోడూరు నుంచి రెడ్డివారిపల్లెకు ఒక్క కిలోమీటర్ దూరం ఉండగా తాత్కాలిక రోడ్డు తెగిపోవడంతో సుమారు 10 కిలోమీటర్లు చుట్టుకుని వెళ్లాల్సి వస్తోంది. గంగురాజు పోడు- పొట్టిరాజుగారిపల్లె, రైల్వేకోడూరు-గుర్రప్పపాళెం గిరిజన కాలనీకి వెళ్లే తాత్కాలిక రోడ్లు కొట్టుకునిపోవడంతో ప్రజలు నానా తంటాలు పడుతున్నారు వర్షాలు ఆగిపోయి వరద తగ్గుముఖం పట్టేంత వరకు తాత్కాలిక రోడ్లకు మరమ్మతులు చేయలేమని అధికారులు చెబుతున్నారు.వర్షం కొనసాగితే జలగండం తప్పదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పది రోజులకే కొట్టుకుపోయిన మట్టి రోడ్డు



కొట్టుకుపోయిన మట్టిరోడ్డు

సుండుపల్లె, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): పింఛా నదిపై ఏర్పాటు చేసిన తాత్కాలిక రోడు పట్టుమని పది రోజులైనా గడవక ముందే కొట్టుకుపోయింది. పింఛా ప్రాజెక్టు నుంచి నీరు విడుదల చేయడంతో పింఛా నదిపై ఉన్న లోలెవెల్ మట్టి కట్ట నెలరోజుల క్రితం కొట్టుకునిపోయింది. దీంతో ఆ ప్రాంతంలో పది రోజుల క్రితం మట్టిరోడ్డు వేశారు. ఈ రోడ్డు కూడా శుక్రవారం కొట్టుకుపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ప్రతి ఏడాది వర్షాకాలంలో ఇదే పరిస్థితి ఏర్పడుతుండడంతో ఇబ్బందులు తప్పడం లేదని, ఇప్పటికైనా హైలెవెల్ వంతెన ఏర్పాటు చేసి పుణ్యం కట్టుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలని వీఆర్ఏల ధర్నా



నిరసన వ్యక్తం చేస్తున్న వీఆర్ఏలు

రాయచోటి కలెక్టరేట్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలైనా తమ సమస్యలు పట్టిం చుకోవడం లేదని వీఆర్ఏల సం ఘం నాయకులు ఆరోపించారు. రాయచోటి కలెక్టర్ ఆఫీస్ వద్ద శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యం లోవారు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సంఘం గౌరవాధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్, జిల్లా అధ్యక్షుడు కొరముట్ల సుధాకర్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ. రామాంజులు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షురాలు డీ. భాగ్యలక్ష్మి, మాట్లాడుతూ ఎనిమిదేళ్లుగా వీఆర్ఏ లకు ఒక్క రూపాయి కూడా వేతనం పెరగలేదన్నారు. గత ప్రభుత్వం ఎన్నికల వాగ్దానం అమలు చేయకపోగా ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 17 నెలలు అయినా తమను పట్టించుకోలేదని వాపోయారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. అంగన్వాడీ యూనియన్ జిల్లా కమిటీ సభ్యురాలు సిద్ధమ్మ, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలి



ర్యాలీలో గ్రామస్తులు, విద్యార్థులు

సుండుపల్లె, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రైతులందరూ ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని న్యాచురల్ ఫార్మింగ్ కోఆర్డినేటర్ అనూష తెలిపారు. మండలంలోని పెద్దినేనికాలువ గ్రామ పంచాయతీ ఈడిగపల్లెలో శుక్రవారంవిద్యార్థులు, గ్రామస్తులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించాలంటే ప్రకృతి వ్యవసాయం తప్పనిసరిఅని వివరించామన్నారు. రసాయనాలతో పండించిన కూరగాయలు, పండ్లు తినడం వలన అనారోగ్యం బారిన పడే అవకాశాలు ఉన్నాయని తెలియజేశామన్నారు. ఉపాధ్యాయురాలు పావని, జనసేన నాయకులు రామాశ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు నిండిన పోలిచెరువు

రాజంపేట, డిసెంబరు 5 (ఆంధ్ర జ్యోతి) : ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురవడం, పుల్లంగేరు పొంగి ప్రవహించడంతో మండ లంలో అతి పెద్దదైన పోలిచెరువు ఎట్టకేలకు నిండింది. . దీంతో నీరు వృథా కాకుండా పోలిచెరువు సంఘం అధ్యక్షుడు నాగినేని నాగేశ్వరనాయుడు, రామ్‌నగర్ నరసింహ, టీడీపీ సీనియర్ నాయకులు బాపనయ్యనాయుడు తదితరులు తూము బిగించారు. ఈ చెరువు నిండడం వల్ల 1500 ఎకరాల ఆయకట్టుకు నీరు అందడమేగాక రాజంపేట చుట్టుపక్కల ప్రాంతాల్లో భూగర్భజలాలు అభివృద్ధి చెందుతాయని వారు తెలిపారు.

రాజంపేటకు చేరిన ఏక్ భారత్ - శ్రేష్ట భారత్ యాత్ర



పాదయాత్రికులకు స్వాగతం పలుకుతున్న తహసీల్దారు పీరుమున్నీ

రాజంపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించిన ఏక్ భారత్ శ్రేష్ట భారత్ శుక్రవారం రాజంపేట పట్టణంలోని మన్నూరు ఆంజనేయస్వామి ఆలయానికి చేరుకుంది. దేశంలోని రెండు పురాతన జ్ఞానకేంద్రాల మధ్య శతాబ్దాల నాటి సజీవ సంబంధాలను బలోపేతం చేయ డానికి ప్రధాని నరేంద్రమోడి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా తమిళనాడు నుంచి వారణాసికి వెళ్లే బృందం రాజంపేటకు చేరుకుంది. వీరికి రాజంపేట తహసీల్దారు పీరుమున్నీ రాజంపేట ఎన్జీవో సంఘ అధ్యక్షుడు వరదయ్య, ప్రధాన కార్యదర్శి కుమార్, వీహెచ్‌పీ స్వాగతం పలికారు. ఈనెల 2న తమిళనాడు ప్రాంతంలో తెన్‌కాశిలో ప్రారంభ మైన ఈ యాత్ర ఈనెల 10న వారణాసిలో ముగుస్తుందన్నారు.

దివ్యాంగులకు బహుమతి ప్రదానం

పెనగలూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులకు విద్యతో పాటు తమకు తానే సొంతంగా నిత్య కృత్యాలు చేసుకునేవిధంగా తీర్చిదిద్దడం గొప్ప విషయమని పెనగలూరు హైస్కూల్ ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ఆలం మహేష్‌నాయుడు అన్నారు. పెనగలూరు ఉన్నత పాఠశాల ప్రాంగణంలోని భవిత కేంద్రంలో ఐఈఆర్టీ జి.రమాదేవి అధ్యక్షతన అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా దివ్యాంగులకు బహుమతులు ప్రదానం చేశారు.

వైభవంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం



గ్రామోత్సవానికి స్వాగతం పలుకుతున్న భక్తులు

పెనగలూరు,డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సింగారెడ్డిపల్లె పంచా యతీ గడ్డమీద హరిజనవాడలో గురు వారం రాత్రి అయ్యప్పస్వామి గ్రామో త్స వం నిర్వహించారు.మహిళలు పెద్ద ఎ త్తున దీపాలతో స్వాగతం పలికారు. సాత పల్లె, గడ్డమీద హరిజనవాడల్లో శుక్రవారం మధ్యాహ్నం అయ్యప్ప భక్తులకు అన్నదానం చేశారు.

సర్పంచ్ ఆధ్వర్యంలో రోడ్డుకు మరమ్మతులు



రోడ్డుపై ఏర్పడిన గుంతలను ఎక్స్‌కవేటర్‌తో పూడుస్తున్న సర్పంచ్ జైపాల్‌రెడ్డి

ఓబులవారిపల్లె, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండల కేం ద్రంలో రైల్వే అండర్ బ్రిడ్జి ని ర్మిస్తున్న ప్రాంతంలో గోతుల మయమైన రోడ్డుకు స్థానిక సర్పంచ్ జైపాల్‌రెడ్డి, డీఆర్‌యూసీ సభ్యుడు తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి శుక్రవారం మరమ్మతులు చేయించారు. రైల్వేస్టేషన్, బ్యాంకులు, ఎంఈవో, తహసీల్దారు, పోస్టాఫీసు, పోలీసు స్టేషన్ వంటి ప్రధాన కార్యాలయాలకు వెళ్లే రహదారి కావడంతో ప్రజలు అసౌకర్యాలకు గురికాకుండా ఉండే దుకు రహదారి మరమ్మతు చేసినట్లు సర్పంచ్ తెలిపారు. గుంతలతో తీవ్ర ఇబ్బందులకు గురైన ప్రయాణికులు మరమ్మతులు చేయించిన సర్పంచ్‌కు అభి నందనలు తెలియజేశారు.

రామాపురంలో కుక్కల బెడద



రామాపురం జాతీయ రహదారిపై గుంపులుగా తిరుగుతున్న కుక్కలు

రామాపురం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని హైవేపై కుక్కలు, గువ్వలచెరువు బస్టాండులో ఆవులు విచ్చల విడిగా తిరుగుతుండ డంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వీటి కారణంగా వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయని అంటున్నారు. వీటి కారణంగా ఒంటరిగా రోడ్డుమీద వెళ్లడానికి కూడా భయపడే పరిస్థితి ఏర్పడిందని అంటున్నారు. సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సెంట్రల్ జైలు కోసం స్థల పరిశీలన



జైలు అధికారులతో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి(కలెక్టరేట్), డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో సెంట్రల్ జైలు నిర్మాణం కోసం శుక్రవారం సాయంత్రం మంత్రి రాంప్రసాద్‌రెడ్డి స్థలాన్ని పరిశీలించారు. జైలు అధికారులతో కలిసి పట్టణంలోని రింగురోడ్డులో గల ప్రభుత్వ భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు పది ఎకరాల స్థలంలో జిల్లా సెంట్రల్ జైలును అత్యాధునిక నూతన హంగులతో ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జైలు అధికారులు, పోలీసు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

పనితీరు మార్చుకోకుంటే.. కఠిన చర్యలు

● ఎస్పీడీసీఎల్ అధికారులకు సీజీఎం హెచ్చరిక



అధికారులతో సమీక్షిస్తున్న ఎస్పీడీసీఎల్ సీజీఎం

మదనపల్లెటౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు సేవలందించడంలో ఎస్పీడీసీఎల్ క్షేత్రస్థాయి సిబ్బంది, అధికారులు పనితీరు మెరుగుపరచుకోవాలని ఎస్పీడీసీఎల్ సీజీఎం జానకిరామ్ సూచించారు. శుక్రవారం స్థానిక ఫంక్షన్‌హాల్లో మదనపల్లె ఎస్పీడీసీఎల్ డివిజన్‌లోని 11 మండలాల ఏఈలు, క్షేత్రస్థాయి సిబ్బందితో సీజీఎం సమీక్షించారు. ఎనిమిది నెలుగా 11 మండలాల ఏఈలు, వారి సిబ్బంది పనితీరుపై వినియోగదారుల నుంచే ఫీడ్‌బ్యాక్ తీసుకున్నామన్నారు. కమర్షియల్ ఎస్‌ఈ సోమశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ సిబ్బంది ఎవరి విధులు వారే తెలుసుకుని విధులు సక్రమంగా నిర్వహిస్తే దానంతట అదే సత్ఫలితాలు వస్తాయన్నారు. సమావేశంలో మదనపల్లె ఎస్పీ డీసీఎల్ ఈఈ గంగాధరం, ఏడీఈలు హరిబాబు, సురేంద్ర, గోవిందరెడ్డి, 11 మండలాల ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

పురాతన ఆలయాల అభివృద్ధికి చర్యలు

గాలివీడు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ మారుమూల ప్రాంతాల్లోని పురాతన ఆలయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు దేవదాయ సహాయ కమిషనర్ విశ్వనాథ్ తెలిపారు. శుక్రవారం నూలివీడు పంచాయతీ నల్లాబత్తినవారిపల్లెలో శ్రీవాణి ట్రస్టు ద్వారా రామాలయ నిర్మాణానికి తగిన స్థలాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ దరఖాస్తు చేసిన ఆలయాల స్థలాలను పరిశీలించి నివేదికను కమిషనర్‌కు పంపుతామని తెలిపారు. దేవదాయ శాఖలో రిజిస్టరై పబ్లికేషన్ అయివున్న పురాతన ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా 36 ఆలయాలు ధూప దీప నైవేద్యానికి ఎంపికయ్యాయన్నారు. కార్యక్ర మంలో ఎండోమెంట్ ఏఈ రవితేజ, స్థానికులు హిమకర్‌రెడ్డి, నాగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డులకు ఆటల పోటీలు



పోలీస్‌పరేడ్ మైదానంలో పరుగు పందెంలో మహిళా హోంగార్డులు

రాయచోటిటౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): హోంగార్డ్స్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక పోలీసు పరేడ్ మైదానంలో శుక్రవారం జిల్లా హోంగార్డుల ఆటల పోటీలు నిర్వహించారు. హోంగార్డుల్లో శారీరక దారుఢ్యం, క్రమశిక్షణ, టీమ్ స్పిరిట్ పెంపొందించేందుకు ఈ క్రీడలు ముఖ్యమైన వేదికగా నిలుస్తాయని ఎస్పీ అభిప్రాయపడ్డారు. ఈ పోటీల్లో 100 మీటర్ల పరుగు, షాట్‌పుట్, వాలీబాల్, టగ్ ఆఫ్ వార్ వంటి పోటీలు నిర్వహించారు. అధిక సంఖ్యలో హోంగార్డులు ఉత్సాహంగా క్రీడా పోటీల్లో పాల్గొని తమ క్రీడా నైపుణ్యాన్ని, శారీరక దారుఢ్యాన్ని ప్రదర్శించారు. అనంతరం ఎస్పీ ధీరజ్ కునుబిల్లి విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేస్తారు. కార్యక్రమంలో ఆర్ఐ పెద్దయ్య, ఆర్ఎస్ఐలు శ్రీనివాసులు, రవి, అమరనాథ్‌రెడ్డి, హోంగార్డ్స్ ఇన్‌చార్జిలు బాలాజీ, రమేశ్, లక్ష్మిరెడ్డి, హోంగార్డులు పాల్గొన్నారు.

ఎనిమిది మంది 'ఎర్ర'స్మగ్లర్ల అరెస్టు

● 12 దుంగల స్వాధీనం



స్మగ్లర్ల అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

మంగళం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా సానిపాయ అటవీ పరిధిలోని రాయవరం సెక్షన్‌లో శుక్రవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు కూంబింగ్ నిర్వహించి ఎనిమిది మంది స్మగ్లర్లను అరెస్టు చేసి, 12 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. కడప సబ్ కంట్రోల్‌కు చెందిన ఆర్ఎస్ఐ నరేశ్ బృందం స్థానిక ఫారెస్టు బీటు ఆఫీసర్ అంజనాస్వాతితో కలిసి శుక్రవారం తెల్లవారుజామున అన్నమయ్య జిల్లా సానిపాయ అటవీ పరిధిలోని రాయవరం సెక్షన్ చిన్నముచ్చురాళ్లగుట్ట వద్ద కూంబింగ్ చేపట్టారు. కొంతమంది గుమికూడి ఉండటం గమనించి, సమీపిస్తుండగా వారు పారిపోయే ప్రయత్నం చేశారు. వెంబడించి ఎనిమిది మందిని పట్టుకున్నారు. చుట్టుపక్కల పరిశీలించగా 12 ఎర్రచందనం దుంగలు లభించాయి. నిందితులు తమిళనాడు కల్లకురిచ్చి జిల్లాకు చెందిన వారిగా గుర్తించారు. స్మగ్లర్లను, ఎర్రచందనం దుంగలను తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సీఐ ఖాదర్‌బాషా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

రెండు వరుసల రహదారి పనులకు.. మోక్షం

● నాడు వైసీపీ నేతల నిర్లక్ష్యం
● నేడు కూటమితో ముందడుగు
● అభివృద్ధికి రూ.5.5 కోట్లు విడుదల
● సుండుపల్లెలో రూ.14 లక్షలతో టెండర్లు పూర్తి

సుండుపల్లె, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో పాలకులు అభివృద్ధిని మరిచారు. రోడ్లను ప్రారంభించి మధ్యలో వదిలేయడంతో వాహన దారులు అష్టకష్టాలు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది.



రూ.14 లక్షలతో పనులు జరగాల్సిన రోడ్డులో వర్షపు నీరు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పల్లె పండుగ పేరిట గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యమిచ్చింది. అయితే గత ఐదేళ్ల క్రితం వైసీపీ పాలనలో రాయచోటి- సుండుపల్లె డబుల్ రోడ్డు పనులను ప్రారంభించారు. రాయచోటి సమీపంలోని ఆంజనేయస్వామి గుడి వద్ద నుంచి సుండుపల్లె భైరవ గుట్ట వరకు 20 కి.మీ. రోడ్డును విస్తరించేందుకు రూ.61.40 కోట్లు నిధులతో పనులు ప్రారంభించారు. ఈ నిధులతో రాయచోటి ఆంజనేయ స్వామి ఆలయం నుంచి శిబ్యాల, అనుంపల్లి మధ్య రహదారిని మొదలు పెట్టి వదిలేశారు. ఈ మార్గంలో శిబ్యాల వంకపై శిథిలావస్థలో ఉన్న వంతెనకు పక్కనే నూతన వంతెన నిర్మాణానికి కడ్డీలు అమర్చి స్లాబ్ వేయకపోవడంతో అవి తుప్పు పట్టాయి. ఆగిపోయిన పనులను ప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది.

రహదారుల అభివృద్ధికి రూ.5.5 కోట్లు

నాలుగేళ్ల క్రితం ప్రారంభించి అర్ధాంతరంగా ఆగి పోయిన పనులు ప్రారంభించి పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. ప్రారంభించి అర్ధాంతరంగా వదిలేసిన పనులను పూర్తి చేసి ప్రయాణి కులకు ఇబ్బందులు లేకుండా చూసేందుకు కూటమి ప్రభుత్వం రూ.5.5 కోట్లు నిధులు విడుదల చేసినట్లు రవాణా, భవనములశాఖ అధికారులు చెబుతున్నారు. రాయచోటి- రాజంపేట మార్గమధ్యంలో, రాయచోటి- సుండుపల్లె మార్గమధ్యంలో ఆగిపోయిన పనులను పూర్తి చేసేందుకు ప్రభుత్వం జీవో విడుదల చేయడం జరిగింది. త్వరలో టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభించ నున్నట్లు అధికారులు చెబుతున్నారు.



గత ప్రభుత్వంలో ప్రారంభించి వదిలేసిన ప్రధాన రహదారి

రూ.14 లక్షలతో టెండర్లు పూర్తి

మండల కేంద్రంలో కెనరా బ్యాంకు ఎదురుగా ప్రధాన రహదారిపై వర్షపు నీరు, మురికినీరు నిలువ ఉండ డంతో వాహనదారులు, బాటసారులు తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారు. రోజు వందలాది వాహ నాలు తిరిగే రవాణా భవనముల శాఖ రహదారి కొన్ని సంవత్సరాలుగా మోకాళ్ల లోతు రోడ్డు గుంతగా మారి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గత కన్ని సంవత్సరాలుగా ఎవ్వరూ పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వంలో ఆ సమస్య పరిష్కారానికి రూ.14 లక్షలు నిధులు మంజూరు చేయడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. టెండర్లు పూర్తి అయ్యాయని, ప్రస్తుతం వర్షాలు పడుతున్నాయి. వర్షాలు ఆగిన వెంటనే పనులు ప్రారంభిస్తామని అధికారులు చెబుతున్నారు.



అత్యవసరంగా నిర్మించాల్సిన బ్రిడ్జి

రహదారి సమస్యలు పరిష్కారం

- కుమార్‌బాబు, రవాణా, భవనాల శాఖ ఏడీ

సుండుపల్లె- రాయచోటి మార్గమధ్యంలో రహదారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. త్వరలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభించడం జరుగుతుంది. మండల కేంద్రంలో రూ.14 లక్షలతో టెండర్లు పూర్తి అయ్యాయి. పనులు ప్రారంభిస్తాము.

డీడీఓల్లో డ్వామా క్లస్టర్ కేంద్రాల విలీనం

● కడప, అన్నమయ్య జిల్లాల్లోని సీఎల్ఆర్సీలు తరలించే ఏర్పాట్లు

కలికిరి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్య మంత్రి పవన్‌కల్యాణ్ గురువారం ప్రారంభించిన డివిజనల్ డెవలప్‌మెంట్ కార్యాలయాలను రెవెన్యూ డివిజన్ స్థాయిలో అన్నివిధాలా బలోపేతం చేయడానికి ప్రభుత్వం చర్యలు మొదలు పెట్టింది. కొత్తగా ఏర్పాటవుతున్న డీడీఓ కార్యాలయాలు మినీ కలెక్టరేట్‌లుగా పనిచేస్తాయని ఇప్పటికే ప్రభుత్వం స్పష్టం చేసింది. నాలుగేళ్లగా దిశా నిర్దేశం లేకుండా ఉన్న డీడీఓ పోస్టులను కీలక విభాగానికి అనుసంధానించి పలు అధికారాలను కట్టబెట్టే దిశగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. అందులో భాగంగా ఇప్పటికే డివిజనల్ పంచాయతీ అధికారులను డీడీఓలకు అప్పగించారు. దీనికి కొనసాగింపుగా తాజాగా డ్వామా ఆధ్వర్యంలో ఉపాధి హామీ, వాటర్ షెడ్ పనులను పర్యవేక్షిస్తున్న క్లస్టర్ కార్యాల యాలను ఏపీడీలతో సహా డీడీఓ కార్యాలయాల్లో విలీనం చేస్తూ గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. వైఎస్సార్ కడప జిల్లాలోని నాలుగు క్లస్టర్ లెవెల్ రిసోర్స్ కేంద్రాలు (సీఎల్ఆర్సీలు), అన్నమయ్య జిల్లాలోని మూడు సీఎల్ఆర్సీలను డీడీఓ కార్యాలయాలకు తరలించే ఏర్పాట్లు చేసింది. అందులో పనిచేసే ఏపీడీలను కూడా డీడీఓల అజమాయిషీకి మార్చారు. ప్రస్తుత సీఎల్ఆర్సీ భవనాల్లో డీడీఓ కార్యాలయాలను కూడా ఏర్పాటు చేస్తున్నారు.

కడప జిల్లాలో..

మైదుకూరు క్లస్టర్‌ను ఏపీడీ బి.మైథిలి సహా బద్వేలు డీడీఓ కార్యాలయంలో విలీనం చేశారు. జమ్మల మడుగు సీఎల్ఆర్సీని ఏపీడీ ఆర్.రామలింగేశ్వర్ రెడ్డి సహా జమ్మలమడుగు డివిజన్‌లో, కమలాపురం సీఎల్ఆర్సీని ఏపీడీ కె.అజాద్ సహా కడప డీడీఓ కార్యాలయంలో విలీనం చేశారు. పులివెందుల సీఎల్ ఆర్సీని కూడా పులివెందుల డీడీఓలోకి తరలించనున్నారు. ఇక్కడ ఏపీడీ పోస్టు ఖాళీగా ఉన్నందున పులివెందుల డీడీఓ వి.విజయలక్ష్మిని తాత్కాలికంగా ఇన్‌చార్జి ఏపీడీగా నియమించారు.

అన్నమయ్య జిల్లాలో..

మదనపల్లె (తంబళ్లపల్లె) క్లస్టర్‌ను మదనపల్లె డీడీఓ అధీనంలోకి మార్చారు. కలికిరి క్లస్టర్ ఏపీడీగా పనిచేస్తున్న ఎన్.శ్రీనివాసులును కూడా మదనపల్లె డీడీఓ కార్యాలయానికి బదిలీ చేశారు. అయితే మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయాన్ని కొత్తగా ఏర్పాటు కానున్న కలెక్టర్ ఆఫీసుకు వినియోగించాలనే ఆలోచనతో ఇక్కడున్న సీఎల్ఆర్సీ భవనాన్ని సబ్ కలెక్టర్ కార్యాలయం ఏర్పాటుకు పరిశీలిస్తున్నారు. ఇదే జరిగితే డీడీఓ కార్యాలయానికి ప్రత్యామ్నాయ వసతి చూడాల్సి ఉంది. ఇక రాజంపేట క్లస్టర్‌ను ఏపీడీ ఎం.ప్రతాప్‌తో సహా రాజంపేట డీడీఓకు అనుసంధానిస్తున్నారు. రాయచోటి క్లస్టర్‌ను ఏపీడీ ఎస్.మధుబాబుతో సహా రాయచోటి డీడీఓ కార్యాలయంలో విలీనం చేస్తు న్నారు. కాగా కలికిరి క్లస్టర్ రద్దవుతున్న నేపథ్యంలో ఇక్కడ డిప్యుటేషన్‌లో ఉన్న ఏపీడీ వై.నందకుమార్ రెడ్డిని రాయచోటి డ్వామా కార్యాలయానికి బదిలీ చేశారు. ఈ మేరకు పంచాయతీ రాజ్, గ్రామీణా భివృద్ధి శాఖ కమిషనర్ మైలవరపు వీఆర్ కృష్ణతేజ ఆదేశాలు జారీ చేశారు. త్వరలో పీలేరులో కొత్త రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కానున్న నేపథ్యంలో డీడీఓ కార్యాలయం కూడా ఏర్పాటవుతుంది. దీనిలో విలీనం చేయడానికి పీలేరు క్లస్టర్ ఏపీడీ కార్యాల యం సర్దుబాటును ప్రస్తుతానికి వాయిదా వేశారని సమాచారం.

యువకుడు ఆత్మహత్య



మృతిచెందిన పిడుగు రెడ్డిశేఖర్

రాయచోటి, నేతాజీసర్కిల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): దురలవాట్లకు బానిసైన ఓ వ్యక్తి గురువారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్య చేసు కున్నాడు. పోలీసుల వివరాల మేరకు... వాయల్పాడు మండలం నగిరిపల్లెకు చెందిన పిడుగు రెడ్డిశేఖర్ (24) ఐదేళ్ల క్రితం వైజాగ్‌కు చెందిన ఓ మహిళతో సహజీవనం చేసేవాడు. ఆమెతో మనస్పర్ధలు రావడంతో విడిపోయి మండల పరిధిలోని శెట్టిపల్లె గ్రామం ఎగులమూలపల్లెలో బంధువుల ఇంటిలో ఉంటున్నాడు. ఈ క్రమంలో చెడు అలవాట్లకు బానిసైన అతను గురువారం సాయంత్రం ఎగువమూలపల్లెకు సమీపంలోని పొలం వద్ద చెట్టుకు ఉరివేసుకున్నాడు. అతను రాత్రి ఇంటికి రాకపోవడంతో బంధువులు చుట్టుపక్కల వెతకగా చెట్టుకు ఉరేసుకొని కనిపించాడు. దీంతో వారు శుక్రవారం పోలీసులకు సమాచారం అందించగా ఏఎస్ఐ బాదుల్లా సంఘటన స్థలానికి చేరుకొని మృతికి గల కారణాలు తెలుసుకున్నారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని గేదె మృతి



మృతిచెందిన గేదె

రామాపురం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పాతరామాపురం సమీపంలోని రైతు భరోసా కేంద్రం ఎదురుగా గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని తన గేదె మృతి చెందినట్లు చప్పిడి లక్ష్మినారాయణ తెలిపారు. రూ.70 వేలకు కొనుగోలు చేసిన గేదె ఆధారంగా కుటుంబాన్ని పోషించుకుంటున్నానని, గేదెలను మేత కోసం రోడ్డు దాటిస్తుండగా గుర్తు తెలియని వాహనం వేగంగా వచ్చి ఢీకొందని తెలిపాడు. సంబంధిత అధికారులు తనకు ఆర్థికసాయం అందించాలని ప్రభుత్వాన్ని కోరాడు.

రూ.3.45 లక్షల ఎరువులు సీజ్...!



రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ

గుర్రంకొండ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖ అనుమతులు లేకుండా రైతులకు విక్రయిస్తున్న ఎరువులను రాయచోటి వ్యవసాయశాఖ ఏడీఏ శ్రీలత సీజ్ చేశారు. పట్టణంలోని గ్రోమోర్, పుడమి, జైకిసాన్ ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ ఎరువుల దుకాణాల్లో ప్రభుత్వ అనుమతులు లేకుండా విక్రయిస్తున్న వివిధ రకాల ఎరువులు, డ్రిప్ ఎరువులను సీజ్ చేశారు. మూడు దుకాణాల్లో 11.221 మెట్రిక్ టన్నుల ఎరువులను సీజ్ చేసినట్లు తెలిపారు. అధికారులు సీజ్ చేసిన ఎరువుల విలువ రూ.3,45,603 లక్షల ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఓ రత్నమ్మ, రాజేంద్ర పాల్గొన్నారు.

రూ.5.73 కోట్లతో పట్టాభిరామాలయ అభివృద్ధి

● మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రమౌళి



వాల్మీకిపురంలో రథం షెడ్డు పనులను పరిశీలిస్తున్న నాయకుడు

వాల్మీకిపురం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురంలో వెలసిన పురాతన పట్టాభిరామాలయ అభివృద్ధికి పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక చొరవతో రూ.5.73 కోట్లు టీటీడీ నిధులు మంజూరు చేసిందని మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రమౌళి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఆలయ సమీపంలోని స్వామివారి బ్రహ్మరథం షెడ్డు అభివృద్ధి పనులకు రూ.3లక్షలతో జరుగుతున్న పనులను టీడీపీ నేతలతో కలిసి ఆయన పరిశీలించారు. ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, జేఈఓ వీరబ్రహ్మం సహకారంతో ఆలయంలో వివిధ అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాయన్నారు. పట్టాభిరాముడి రథం చుట్టూ షెడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు పనులు కూడా చేపట్టడం హర్షనీయమన్నారు. ఇప్పటికే వాల్మీకిపురంలో టీటీడీ స్వాగత ఆర్చిల నిర్మాణానికి రూ.30లక్షలు, కోనేటి వీధిలోని పట్టాభిరాముడి గరుడ పుష్కరిణి అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు రూ.1.12కోట్లు, తోటవీధిలోని ఆరుబయట పట్టాభిరాముడి కల్యాణ వేదిక అభివృద్ధి పనులకు సంబంధించి రూ.73 లక్షలతో టీటీడీ టెండర్లు పూర్తి చేశారన్నారు. అలాగే ఆలయం వెనుక భాగంలోని రాజ గోపురం నిర్మాణానికి రూ.52 లక్షలు, స్థానిక టీటీడీ కల్యాణ మండపం పునఃనిర్మాణ పను లకు రూ.1.80కోట్లు, పార్వేట మండప నిర్మాణా నికి రూ.1.26 కోట్లు, తరిగొండ లక్ష్మీనరసింహ స్వామి ఆలయ కోనేరు అభివృద్ధి పనులకు రూ.1.50కోట్లు నిధులను టీటీడీ మంజూరు చేసిందని త్వరలోనే టెండర్లు పూర్తి చేసి పనులు కూడా ప్రారంభిస్తామన్నారు. కార్యక్ర మంలో నాయకులు పీవీ నారాయణ, రాజేంద్రా చారి, కోసూరి రమేష్, మున్వర్, కేకేనాయుడు, గాంధీపేట రెడ్డి, సయ్యద్‌బాషా, శ్రీనివాసులు పాల్గొన్నారు.

యువకుడిపై హత్యాయత్నం కేసు

మదనపల్లెఅర్బన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పుంగనూరు రోడ్డు కనుమలో గంగమ్మ ఆలయం వద్ద నివాసం ఉన్న రెడ్డిశేఖర్ సొంతంగా ఆటో నడుపుతూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో చెంబకూరు రోడ్డు రాగిమాను వద్ద ఉన్న నాన్నమ్మ లక్ష్మీదేవి ఇంటికి వెళ్లేందుకు ఆటోలో రాగిమాను వద్దకు వెళ్లాడు. అక్కడ వేచి ఉన్న రెడ్డిశేఖర్‌ను వాల్మీకి వీధికి చెందిన తరుణ్ మద్యంమత్తులో బాడుగకు రావాలని అసభ్యకరంగా మాట్లాడాడు. నాన్నమ్మ కోసం వేచివున్నాను అంటుండగానే తాను పిలిస్తే రావా అంటూ తన జేబులోని చాకుతో రెడ్డిశేఖర్ గొంతు పై కోసి పరారయ్యాడు. స్థానికులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తర లించి చికిత్స అందించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు హత్యా య త్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ తెలిపారు.

వైభవంగా అయ్యప్పస్వామి గ్రామోత్సవం



చెక్‌పోస్టు శివాలయం నుంచి ప్రారంభమైన అయ్యప్పస్వామి గ్రామోత్సవం

రాయచోటిటౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శుక్రవారం అయ్యప్ప స్వామి గ్రామోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. విద్యుత్ దీపాలతో అలం కరించిన వాహనంపై అయ్యప్ప స్వామి ఉత్సవ విగ్రహాన్ని ఏర్పాటు చేసి అయ్యప్ప భక్తుల కోలాటాల నడుమ గ్రామోత్సవం నిర్వహించారు. రాయచోటి పట్టణంతో పాటు చుట్టుప్రక్కల ప్రాంతాలకు చెందిన అయ్యప భక్తులు వందల సంఖ్యలో గ్రామోత్సవంలో పాల్గొన్నారు. స్థానిక ఎస్ఎన్ కాలనీ చెక్‌పోస్టు సమీపంలోని ఉమా మహేశ్వరస్వామి ఆలయం నుంచి ఈ ఉత్సవం ప్రారంభమైంది. అర్చకులు నటరాజ స్వామి, ఆలయ కమిటీ సభ్యులు అరమాటి శివగంగి రెడ్డి, ఇతర స్వాములతో కలిసి పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్వామి వారి గ్రామోత్సవాలు చూసేందుకు అయ్యప్ప స్వా ములతో పాటు రాయచోటి నియోజకవర్గ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహిళలు స్వామివారికి కాయ కర్పూరం సమర్పించారు.

గురుస్వాములకు ముస్లింల సన్మానం

గత ఏడాది అయ్యప్ప గ్రామోత్సవం సందర్భంగా ఏర్పడిన ఆందోళనకర పరి స్థితుల్లో ఈ ఏడాది ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగ కుండా రాయచోటి డీఎస్పీ కృష్ణ మోహన్ పర్యవేక్షణలో అర్బన్, రూరల్, లక్కిరెడ్డిపల్లె సీఐలు వెంకటాచలపతి, వరప్రసాద్, కొండారెడ్డి గట్టి బందోబస్తు నిర్వ హించారు. అయితే, గ్రామోత్సవాని పలువురు ముస్లిం పెద్దలు స్వాగతం పలకడంతో పాటు, భక్తులకు అరటి పండ్లు, నీళ్ల సీసాలు అందజేశారు. గురుస్వాములను శాలువాలతో సన్మానించి మత సామరస్యాన్ని చాటుకున్నారు.



పల్లకీ ఉత్సవంపై అయ్యప్పస్వామి

వ్యక్తిపై దాడి... పోలీసులకు ఫిర్యాదు

గుర్రంకొండ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): తన కుమారుడిపై దాడి చేసి విచక్షణారహితంగా కొట్టిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని లక్ష్మీదేవి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. నడిమిఖండ్రిగ పంచాయతీ పేరంపల్లె వాసులు పెద్దరెడ్డెప్ప, లక్ష్మీదేవి కుమారుడు ఆంజనే యులు సొంతపనుల నిమిత్తం గురువారం రాత్రి నడిమిచెర్లకు వెళ్లి వస్తుండగా వర్షం కురవడంతో మార్గమధ్యలోని ఓ రేకుల షెడ్ వద్దకు వెళ్లారు. ఈ క్రమంలో రేకుల షెడ్ యజమానికి, ఆంజనేయులకు వాగ్వాదం జరి గింది. ఈ నేపథ్యంలో రేకుల షెడ్ యజమాని ఆంజనేయులుపై దాడి చేయడంతో రక్తగాయాలయ్యాయి. గమనించిన కుటుంబ సభ్యులు బాధితున్ని 108 వాహనంలో వాల్మీకిపురం ఆస్ప త్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయా ఆస్పత్రికి తీసుకెళ్లారు. బాధితుని తల్లి లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు పోలీసులు విచారిస్తున్నట్లు ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు.

వర్షం... కల్లోలం

- చేతికివచ్చిన వరి పంట నీటిపాలు
- ధాన్యం ఆరక అవస్థలు
- రైతన్నల కళ్లలో కన్నీరు

ఆరుగాలం కష్టపడి వరి పంట పండించిన రైతన్నలకు దిత్వా తుఫాను కన్నీరు మిగిల్చింది. తుఫాను కారణంగా గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి చేతికి అంది వచ్చిన వరిపంట నీటి పాలైంది. ఇక ఇప్పటికే కోత కోసి కల్లాల్లో, రోడ్లపై ఆరబోసిన ధాన్యం మగ్గిపోతోంది. దీంతో ఏం చేయాలో అర్థం కాక రైతులు తలలు పట్టుకుంటున్నారు.



చెన్నూరు : తడిచిన ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్న మహిళ



చెన్నూరు : రోడ్లపై ఆరబోసిన ధాన్యంపై పట్టలు కప్పిన దృశ్యం

చెన్నూరు/అట్లూరు/చాపాడు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాను కారణంగా గత నాలుగు రోజులు నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో వరి రైతులు తీవ్రంగా నష్టపోయారు. మండలంలోని రామనపల్లె, చిన్నమాచుపల్లె, ఉప్పరపల్లె, బుడ్డాయపల్లె గ్రామాల్లో రైతులు వరికోతలు కోశారు. ధాన్యాన్ని జాతీయ రహదారి పక్కన సర్వీసు రోడ్డులో ఆరబోసుకున్నారు. వర్షం ప్రతి రోజూ కురుస్తూనే ఉండటంతో పట్టలు కప్పి ఉంచారు. అయినా ధాన్యం చుట్టూ నీరు చేరి అడుగు భాగంలో తడిచి పోయింది. అక్కడక్కడా సన్నటి మొలకలు కూడా వచ్చాయి. ధాన్యాన్ని రోజూ తెరిపి ఇచ్చినప్పుడల్లా ఆరబోసుకుంటున్నా.. పట్టలపై నీళ్లు నిలబడి ధాన్యం తడుస్తోంది. దీంతో దళారులు పుట్టి ధాన్యం 12వేలకు పైగా ఉండగా, 11వేలకు బేరమాడుతున్నారు. దీంతో ఆరుగాలం చేసిన కష్టం నీటి సమర్పణ అవుతోందని బాధను వ్యక్తం చేస్తున్నారు.

అట్లూరు మండలంలోని కొండూరు గ్రామంలో చెరువుల కింద సాగు చేసిన సుమారు 50 ఎకరాలు వరి పంట నీటి పాలు కావడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు 20వేలు రూపాయలు పెట్టుబడి పెట్టి ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతికి వచ్చే సమయంలో వర్షానికి దెబ్బతిందని వాపోతున్నారు. అలాగే మండలంలోని రెడ్డిపల్లె, కొండూరు, కుంభగిరి, వేమలూరు, తంబళ్లగొంది అట్లూరు గ్రామాల్లో వందల ఎకరాల్లో చీనీ నిమ్మ సాగు చేశారు. ఇప్పుడు పూత, పిందె దశలోని పంట ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి మగ్గి రాలిపోయి నేలపాలైంది. వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు వర్షానికి దెబ్బ తిన్న పంటలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదికలు పంపి నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



వరి ధాన్యానికి కప్పిన టార్పాలిన్ పట్ట

కల్లాల్లో మగ్గుతున్న ధాన్యం

చాపాడు మండలంలో వారం రోజుల నుంచి వరి కోతలు కోస్తున్నారు. సీతారామపురం, చాపాడు, కేతవరం, భద్రిపల్లె, విశ్వనాథపురం, అనంతపురం, నక్కలదిన్నెతో పాటు పలు గ్రామాల పరిధిలో రైతులు కేఎస్ఆర్, కేఎల్ఎం వంటి వరి రకాలను సాగు చేశారు. తక్కువ కాలపరిమితి కలిగిన పంట ప్రస్తుతం కోత దశకుకు రావడంతో రైతులు మిషన్లతో కోసి కల్లాల్లో, రోడ్లపై ఆరబోస్తున్నారు. అయితే తుఫాను కారణంగా మూడు రోజులుగా వర్షం కురుస్తుండడంతో ధాన్యాన్ని కాపాడుకునేందుకు టార్పాలిన్ పట్టలు కప్పారు. దీంతో ధాన్యానికి గాలి, ఎండ తగలక మగ్గుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

నేల తల్లిని కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత

సీకేదిన్నె, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నేలతల్లిని కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఊటుకూరులో శుక్రవారం ఆచార్య ఎన్జీరంగ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ పరిశోధనస్థానం ఆధ్వర్యంలో అంతర్జాతీయ నేలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్యవంతమైన నేలను కాపాడుకుంటూ మన భావితరాలకు సాధ్యమైనంత నేలను అందించడం, సేంద్రియ వ్యవసాయం, జీవన ఎరువులు, జీవ శిలీంద్రాలు ప్రాముఖ్యతను వివరించి రైతుల్లో అవగాహన కల్పించాలన్నారు. నేలల శాస్త్రవేత్త యాస్మిన్ నేల యొక్క ప్రాముఖ్యత, పంటలకు కావాల్సిన స్థూల, సూక్ష్మ పోషకాల ఆవశ్యకతను గురించి వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ కొర్రపాటి సునీల్‌కుమార్, సుబ్రహ్మణ్యం, డాక్టర్ వాకా మాధురి, డాక్టర్ శ్రీవల్లి, అగ్రికల్చరల్ విద్యార్థులు పాల్గొన్నారు.

దేశ ప్రయోజనాల కోసం జ్ఞానం ఉపయోగపడాలి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కాశీలింగం

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): యువత జ్ఞానం దేశ ప్రయోజనాల దిశగా వినియోగం అయితే భారత్ పురోగతి సాధిస్తుందని పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీ మేనేజ్‌మెంట్ స్టడీస్ హెడ్ ప్రొఫెసర్ ఆర్.కాశీలింగం అభిప్రాయపడ్డారు. శుక్రవారం ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగిన క్రాస్ ఫంక్షనల్ మేనేజ్‌మెంట్ అనలిటిక్స్ ఫర్ బిజినెస్ సక్సెస్ జాతీయ వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లాగే అభివృద్ధి చెందుతున్న సాంకేతికతను యువత అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం ఫైనాన్షియల్ అనలిటిక్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మానవ వనరుల అనలిటిక్స్‌పై హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ పి.మురుగన్ మాట్లాడారు. వైవీయు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్, స్కూల్ ఆఫ్ కామర్స్, లా అండ్ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ వై.సుబ్బరాయుడు, డాక్టర్ టి.చంద్రశేఖర్ తదితరులు వర్క్‌షాప్ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమాన్ని కన్వీనర్ డాక్టర్ పి.సరిత నిర్వహించగా, బీఓఎస్ ఛైర్మన్ డాక్టర్ గంగయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పంచాయతీలకు ఆర్థిక తోడ్పాటు అందించాలి

ప్రొద్దుటూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలకు గృహ, గృహేతర నిర్మాణాలకు అను మతులు ఇచ్చే అధికారం ఇవ్వాలని సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షు డు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి కోరారు. శుక్రవారం రాజధాని అమరావతిలో పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణ తేజను శివచంద్రారెడ్డి కలిశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీల్లో నిధుల లేమితో అభివృద్ధి పనులు చేపట్టలేకపోతున్నామన్నారు. కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ అధికారులు పంచాయతీల అనుమతులు లేకుండా ఇష్టానుసారం గ్రామాల్లో గృహ నిర్మాణాలకు, వాణిజ్య గృహాలకు అనుమతులు ఇస్తున్నారన్నారు. ఇది గ్రామ పంచాయతీ అధికారాలను కబ్జా చేయడమేనన్నారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ డిపార్ట్‌మెంటు నుంచి కూడా పంచాయతీలకు రావాల్సిన నిధులు విడుదల చేయించాలన్నారు. కుడా ఇచ్చిన పర్మిషన్లతో వచ్చిన నిధులను కూడా పంచాయతీలకు ఇవ్వడం లేదన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు సైతం విడుదల చేయాలని కోరారు. ఇందుకు కమిషనర్ కృష్ణ తేజ సానుకూలంగా స్పందించి నిధులు విడుదల కోసం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

నకిలీ యాప్‌లను మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేయకండి

- సోషల్ మీడియా అండ్ సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ డీకే జావేద్

కడప క్రైం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నకిలీ యాప్‌లను మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేయవద్దని సోషల్‌మీడియా అండ్ సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ డీకే జావేద్ సూచించారు. శుక్రవారం ఎన్జీవో కాలనీలోని శ్రీ చైతన్య జూనియర్ కాలేజీలో సైబర్ క్రైం, సోషల్ మీడియా అవగాహన, నివారణలో భాగంగా అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో ప్రపంచం మొత్తం సైబర్ క్రైం రూపంలోనే ఎక్కువగా మోసాలు జరుగుతున్నాయని, ఎక్కువగా మహిళలను టార్గెట్ చేసి మోసాలు చేస్తున్నారన్నారు. ఆధార్ అప్‌డేట్, బ్యాంకు నుంచి కాల్ చేస్తున్నామని చెప్పి కాల్ చేసే అపరిచితులకు చెప్పకూడదన్నారు. బ్యాంకు నుంచి ఎప్పుడు కూడా ఇలా కాల్స్ రావన్నారు. కాలేజీ డీన్ బి.నాగరాజు, అడ్మిన్ ఆఫీసర్ మల్లికార్జున స్వామి, కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దొంగతనం కేసులో ముగ్గురు అరెస్టు

4.5 గ్రాములు బంగారు చైను, స్కూటీ స్వాధీనం

కడప క్రైం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో ఇటీవల తాళాలు వేసిన ఇళ్లలో చోరీకి పాల్పడుతున్న ముగ్గురు దొంగలను గురు వారం పాత బైపాస్ వద్ద పోలీసులు అరెస్టు చేశారు. చిన్నచౌకు సీఐ ఓబులేసు వివరాల మేరకు.. కడప నగరం మృత్యుంజయకుంటకు చెందిన ఉదయగిరి పెద్దకుళాయప్ప అలియాస్ లడ్డు, శంకరాపురానికి చెందిన ఇద్దరు మైనర్లతో కలిసి ఎర్రముక్కపల్లె ఏపీహెచ్‌బీ కాలనీ, కడప శంకరాపురంలో తాళాలు వేసిన ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడ్డారు. దొంగలించిన బంగారు చైనును విక్రయించేందుకు బైపాస్‌లో వెళుతు న్నట్లు సమాచారం రావడంతో ఎస్ఐలు రాజరాజేశ్వర్‌రెడ్డి, రవికుమార్, సిబ్బందితో నిఘా ఉంచి పెద్ద కుళాయప్పతో పాటు ఇద్దరు మైనర్లను అరె స్టు చేసినట్లు సీఐ తెలిపారు. నిందితుల నుంచి 4.5 గ్రాముల బంగారు చైను, స్కూటీ, సెల్‌ఫోనును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మైన ర్లను జువైనల్ హోంకు తరలించినట్లు తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : చోరీల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ ఓబులేసు తెలిపారు. ఎవరైనా ఇల్లు వదిలి ఇతరప్రాంతాలకు వెళ్లాల్సి వస్తే.. విలువైన వస్తువులను బ్యాంకు లాకరులో కానీ నమ్మకమైన వ్యక్తుల వద్ద భద్రపరుచుకోవాల న్నారు. ఊర్లకు వెళ్లే సమయంలో తక్షణమే సంబంధిత పోలీసులకు సమాచారం అందిస్తే ఆఇంటిపై నిఘా ఉంచుతామన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా ఇళ్లలో, దుకాణాల్లో ప్రధాన వీధుల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే చోరీ చేసిన వారిని గుర్తించవచ్చని అన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



నాగేశ్వర్‌రెడ్డి (ఫైల్ ఫొటో)

సింహాద్రిపురం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బలపనూరు గ్రామానికి చెందిన బూతునూరు నాగేశ్వరరెడ్డి(60) అనే రైతు అప్పుల బాధతో శుక్రవారం చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మ హత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ రవికుమార్ సమాచారం మేరకు నాగేశ్వరరెడ్డి తనకు ఉన్న 5 ఎకరాల పొలంలో వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునే వాడు. ఈ నేపథ్యంలో పంట దిగుబడులు సరిగా రాకపోవడం, ధరలు లేకపోవడంతో అప్పులు చేయాల్సి వచ్చింది. దీనికితోడు మృతుని భార్య క్యాన్సర్ వ్యాధితో బెంగుళూరు ఆస్పత్రిలో పొందుతోంది. చికిత్స కోసం ఖర్చులు భరాయించాల్సి రావడంతో మనస్థాపానికి గురైన నాగేశ్వరరెడ్డి గ్రామంలోని ఎస్సీ కాలనీ దగ్గర చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి ఇద్దరు కొడుకులు, ఒక కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పులివెందుల ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించి, మృతుడి కుమారుడు నాగవర్ధన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

తమ్ముని‌పై అన్న దాడి... తీవ్రగాయాలు



చికిత్స పొందుతున్న నాగసుబ్బరాయుడు

బి.కోడూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పొలం గట్టు విషయమై తమ్మునిపై అన్న పారతో దాడి చేయడంతో తీవ్ర రక్తగాయాలైన సంఘటన శుక్రవారం బికోడూరు మండలంలో చోటు చేసుకుంది. వివరాలిలా.. పెదుళ్లపల్లె గ్రామానికి చెందిన నాగయ్యకు ఇద్దరు భార్యలు. మొదటి భార్యకు ఒక కుమారుడు కాగా ఆమె అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో రెండో వివాహం చేసుకున్నాడు. ఆమెకు ఒక కుమా రుడు, కూతురు. మొదటి భార్య కుమారుడు సుబ్రహ్మణ్యం బతుకు దెరువు కోసం గల్ఫ్‌కు వెళ్లాడు. గురువారం రాత్రి అతను గల్ఫ్ నుంచి వచ్చాడు. శుక్రవారం ఉదయం పొలం వద్దకు వెళ్లగా.. అప్పటికే తన తమ్ముడు నాగసుబ్బరాయుడు తల్లితో కలిసి వరి నాటేందుకు పొలం వద్ద ఉన్నాడు. ఈ సమయంలో గట్టు చెక్కే విషయంపై అన్నదమ్ములు ఘర్షణ పడ్డారు. దీంతో కోపోద్రిక్తుడైన అన్న సుబ్రహ్మణ్యం తమ్ముడి చేతిలోని పార తీసుకుని అతనిపై దాడి చేసి విచక్షణారహితంగా నరికాడు. దీంతో నాగసుబ్బరాయుడుకు తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని గ్రామస్థుల సాయంతో బద్వేలు ప్రభుత్వ ఆసుపత్రికి.. మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. బద్వేలు సీఐ క్రిష్ణయ్య, ఏఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి సిబ్బందితో అక్కడికి చేరుకుని సుబ్రహ్మణ్యంను అరెస్టు చేసి విచారిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

కొండాపురం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏటూరు-అనంతపురం గ్రామాల మధ్య నేషనల్ హైవేపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి గాయలయ్యాయి. మండలంలోని బుక్కపట్నం గ్రామానికి చెందిన అనిల్‌కుమార్ అనే యువకుడు బైక్‌పై పులివెందులకు వెళుతుండగా అదుపుతప్పి నిలబడి ఉన్న లారీని ఢీకొంది. ఈ సంఘటనలో అనిల్‌కుమార్ తలకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 వాహనంలో తాడిపత్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

యువకుడు అదృశ్యం



మైదుకూరు డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బద్వేలు రోడ్డు గాంధీనగర్‌కు చెందిన ఇర్ఫాన్ (22) అనే యువకుడు ఇంటి వద్ద నుంచి వెళ్లి అదృశ్యమైనట్లు అతని తండ్రి జంగ్లీబాయ్ ఖదీర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ రమణారెడ్డి తెలిపారు. ఆచూకీ తెలిసినవారు 9121100618 కు సమాచారం ఇవ్వాలన్నారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన అవసరం



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ నెల్సన్

కడపసెవెన్ రోడ్స్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన అవసరమని డాక్టర్ నెల్సన్ వినోద్ మోసెస్ పేర్కొన్నారు. ఇటీవల విద్యార్థుల్లో కనిపిస్తున్న ఒత్తిడి, ఆందోళన, నిరాశ వంటి సమస్యలు ఆత్మహత్యా ప్రవృత్తులకు దారి తీస్తున్న నేపథ్యంలో శుక్రవారం కడప రిమ్స్ వైద్య కళాశాలలో నేషనల్ మెడికల్ కౌన్సిల్, డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఆదేశాల మేరకు వైద్య విద్యార్థులకు మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బెంగుళూరు నుంచి వచ్చిన డాక్టర్ నెల్సన్ వినోద్ మోసెస్ ప్రధాన వక్తగా పాల్గొని మెడికల్ చదివే యువత ఎక్కువ సమయం అకడమిక్ ఒత్తిడిలో గడపడం వల్ల వారి భావోద్వేగ సహనశక్తి దెబ్బతింటుందన్నారు. అలాంటి పరిస్థితుల్లో చిన్న సమస్యలు కూడా పెద్దవిగా అనిపించవచ్చని వివరించారు. విద్యార్థులు తమ భావోద్వేగాలను అణచివేయకుండా ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు లేదా నిపుణులతో పంచుకుంటే సమస్యల పరిష్కారం త్వరగా లభిస్తుందని సూచించారు. విద్యార్థుల్లో సాధారణంగా కనిపించే ఒత్తిడి లక్షణాలు, ఎమోషనల్ అసెస్‌మెంట్ పద్ధతులు, ఆత్మహత్య ఆలోచనలను ముందుగానే గుర్తించే సూచికలు, ప్రమాదంలో ఉన్న విద్యార్థులకు క్లాస్‌మేట్స్ ఎలా సహాయం చేయాలి, కాలేజ్ ఆధ్వర్యంలో అందుబాటులో ఉన్న కౌన్సెలింగ్ సదుపాయాల గురించి నిపుణులు వివరించారు. చిన్నపాటి ఆందోళనలను కూడా నిర్లక్ష్యం చేయకూడదని, అవి పెద్ద సమస్యలకు దారి తీయవచ్చని హెచ్చరించారు. సమస్యలు ప్రతి ఒక్కరి జీవితంలో వస్తాయి.. వాటిని దాచిపెట్టకుండా సరైన సమయంలో సహాయం తీసుకుంటే ఏ పరిస్థితినైనా అధిగమించవచ్చని సూచించారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డాక్టర్ జమున, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కళ్యాణి, సైకియాట్రి విభాగాధిపతి డాక్టర్ వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తుడు మృతి



సాయిచంద్ర (ఫైల్)

మైదుకూరు డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మైదుకూరుకు చెందిన కశెట్టి సాయిచంద్ర (29) అయ్యప్ప మండల దీక్షను పూర్తిచేసి డిసెంబరు 1న సోమవారం ఇరుముడితో శబరిమల యాత్రకు బయలుదేరారు. అయ్యప్ప దర్శనం అనంతరం తిరుగు ప్రయాణంలో శుక్రవారం తెల్లవారు జామున కన్యాకుమారి వద్ద శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడుతుండడంతో సహచర భక్తులు తిరునల్వేలి ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఒక్కగానొక్క కుమారుడైన సాయిచంద్ర మృతి వార్త తెలిసిన తల్లిదండ్రులు జయమ్మ, లక్ష్మీనరసయ్యలు బోరున విలపిస్తున్నారు. శరణం అయ్యప్పా అంటూ నీదర్శనం కోసం వస్తే.. నా కుమారుడికి మరణం ప్రసాదించావా... మేమేం పాపం చేశాం అంటూ రోదిస్తున్నారు.

ఏపీఎస్పీ బెటాలియన్ డీఎస్పీ మృతి

- అక్కివారిపల్లెలో విషాదఛాయలు



వెంకటరెడ్డి (ఫైల్)

కలసపాడు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్పీ బాకరాపేట 11వ బెటాలియన్‌లో డీఎస్పీగా పనిచేస్తున్న కందుల వెంకటరెడ్డి శుక్రవారం ఉదయం అకస్మికంగా మృతి చెందాడు. దీంతో ఆయన స్వగ్రామమైన కలసపాడు మండలం అక్కివారిపల్లెలో విషాద ఛాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన వెంకటరెడ్డి సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్‌గా ఎంపికై అనంతరం ఏపీఎస్పీలో ఆర్ఎస్ఐగా, సివిల్ ఎస్ఐ గా, సీఐగా, డీఎస్పీగా పదోన్నతి పొందారు. ప్రస్తుతం బాకరాపేట సమీపంలోని ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లో అసిస్టెంట్ కమాండెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఉదయం గుండెపోటుతో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

డ్రాగా ముగిసిన క్రికెట్ మ్యాచ్‌లు



కేపీ శ్రీరామ్, రతన్, రాజ్

కడప స్పోర్ట్స్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కడపలో వివిధ జట్ల మధ్య సాగుతన్న ఏసీఏ అండర్-14 ఇంటర్ జోనల్ రెండు రోజుల క్రికెట్ మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. ఏసీఏ క్రికెట్ స్టేడియంలో రెస్ట్ ఆఫ్ నార్త్‌జోన్-నార్త్‌జోన్ విన్నర్స్ జట్ల మధ్య సాగిన మ్యాచ్‌లో రెస్ట్‌ఆఫ్‌నార్త్‌జోన్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో కేవలం 55.2 ఓవర్లలోనే 111 పరుగులకు చేతులెత్తేసిన సంగతి తెలిసిందే. నార్త్‌జోన్ విన్నర్స్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో ఆట ముగిసే సమయానికి 9 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 27 పరుగులు చేసింది. రెండవ రోజైన శుక్రవారం తిరిగి బ్యాటింగ్‌కు దిగి 84.3 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 203 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఇందులో కె.పి.శ్రీరామ్ 103 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. బౌలింగ్ విభాగంలో రెస్ట్‌ఆఫ్ నార్త్ జోన్ జట్టు బౌలర్ రతన్ 5 వికెట్లు సాధించారు. దీంతో నార్త్ జోన్ విన్నర్స్ జట్టుకు 92 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. దీంతో రెస్ట్ ఆఫ్‌నార్త్‌జోన్ జట్టు రెండో ఇన్నింగ్స్‌కు దిగి ఆట ముగిసే సమాయానికి 12 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 44 పరుగులు చేసింది. దీంతో మ్యాచ్‌ను డ్రాగా ముగిసినట్లు వెల్లడించారు.

కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో రెస్ట్ ఆఫ్ సౌత్‌జోన్- రెస్ట్‌ఆఫ్ సెంట్రల్‌జోన్ జట్ల మధ్య సాగిన మరో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్‌ఆఫ్ సౌత్‌జోన్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 55 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 165 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. వెలుతురు సరిగా లేని కారణంగా ఆటను నిలుపుదల చేశారు. రెండవ రోజైన శుక్రవారం బ్యాటింగ్ చేపట్టి 77 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 221 పరుగులు చేసింది. ప్రతిగా బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్ ఆఫ్ సెంట్రల్‌జోన్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో ఆట ముగిసే సమయానికి 76 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 317 పరుగులు చేసింది. ఇందులో రాజ్ 139 పరుగులు చేశారు. దీంతో రెస్ట్‌ఆఫ్‌సెంట్రల్‌జోన్ జట్టుకు 96 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. కాగా నిర్వా హకులు మ్యాచ్‌ను డ్రాగా ముగిసినట్లు వెల్లడించారు.

కేఆర్ఎం క్రికెట్ మైదానంలో సెంట్రల్ జోన్ విన్నర్స్-సౌత్‌జోన్ విన్నర్స్ జట్ల మధ్య సాగుతున్న మరో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన సౌత్‌జోన్ విన్నర్స్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 22.5 ఓవర్లలో ఎట్టకేలకు 91 పరుగుల వద్ద ఆలౌట్ అయ్యింది. బౌలింగ్ విభాగంలో సెంట్రల్‌జోన్ విన్నర్స్ బౌలర్ వికేష్ 5 వికెట్లు పడగొట్టారు. ప్రతిగా బ్యాటింగ్‌కు దిగిన సెంట్రల్‌జోన్ విన్నర్స్ జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 58 ఓవర్లలో 210 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో సెంట్రల్ జోన్ విన్నర్స్ జట్టుకు 119 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత లభించింది. అనంతరం రెండవ ఇన్నింగ్స్‌కు దిగిన సౌత్‌జోన్ విన్నర్స్ జట్టు ఆట ముగిసే సమయానికి 28 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 151 పరుగులు చేసింది. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది.

కాశీ తమిళ సంఘమం బృందానికి స్వాగతం

దువ్వూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతకుంట వద్ద శుక్రవారం వారణాశికి వెళుతున్న కాశీ తమిళ సంఘమం బృందానికి జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ స్వాగతం పలికారు. డిసెంబరు 2న బయల్దేరిన ఈ యాత్ర 15వ తేదీకి వారణాశికి వెళ్లనుంది. ఈ మేరకు సభ్యులకు ఆర్డీవో సాదరంగా స్వాగతం పలికారు. టెన్‌కాశీ నుంచి 40 మంది సభ్యులు మినీ బస్సుల్లో ఇక్కడికి చేరుకున్నారు. 14 రోజుల పాటు ఈ యాత్ర కొనసాగుతుందని వారి బృంద సభ్యుడు రమేష్‌శెట్టియార్ తెలిపారు. స్వాగతం పలికిన వారిలో ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున, తహసీల్దారు సంజీవరెడ్డి, ఆర్ఐ జాన్సన్ ఉన్నారు.

అనంత, కడప దేవదాయ అధికారుల మార్పు

అమరావతి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): దేవదాయశాఖ రాష్ట్రంలోని ఇద్దరు జిల్లా శాఖ అధికారులను మార్చింది. కడప జిల్లా ఎండోమెంట్ అధికారి పి.మల్లికార్జున ప్రసాద్‌ను అనంతపురం జిల్లాకు అదే స్థానంలో బదిలీ చేసింది. అలాగే అల్లాడుపల్లి వీరభద్రస్వామి దేవస్థానం ఈవో సి.శంకర బాలాజీకి కడప జిల్లా దేవదాయశాఖ అధికారిగా అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ ఉత్తర్వులను వెంటనే అమలు చేయాలని దేవదాయ శాఖ కమిషనర్‌ను ఆదేశిస్తూ, ఆ శాఖ కార్యదర్శి హరిజవహర్‌లాల్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.





పీలేరు కోటపల్లె ఉన్నత పాఠశాల మెగా పీటీఎంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి - హాజరైన విద్యార్థుల తల్లిదండ్రులు - మదనపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆత్మీయ సమావేశంలో తల్లిదండ్రులకు సెల్యూట్ చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాష తదితరులు

విద్యావ్యవస్థలో సమూల మార్పులు

● నారా లోకేశ్ నేతృత్వంలో విద్యాశాఖ ప్రక్షాళన ● విద్య, అభివృద్ధే శాశ్వతం ● పండుగ వాతావరణంలో సమావేశాలు

● పీలేరు, మదనపల్లె మెగా పీటీఎంలో ఎమ్మెల్యేలు నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి, షాజహాన్ బాష

పీలేరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యావ్యవస్థలో సమూల మార్పులు తీసుకువచ్చేందుకే విద్యా శాఖ మంత్రి పేరెంట్స్ టీచర్ మీటింగ్(పీటీఎం) వంటి వినూత్న కార్యక్రమాలు అమలు చేస్తున్నారని పీలేరు, మదనపల్లె ఎమ్మెల్యేలు నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి, షాజహాన్‌బాష అన్నారు. శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా మెగా పేరెంట్స్ మీటింగ్ 3.0ను నిర్వహించారు. ఇందులో భాగంగా పీలేరు మండలం కోటపల్లె జడ్పీ హైస్కూల్‌లో జరిగిన మెగా పీటీఎంలో ఎమ్మెల్యేలు నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయిన నాటి నుంచి విద్యావ్యవస్థ అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు అమలు చేశారన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నేతృత్వంలో విద్యాభివృద్ధి కోసం తల్లిదండ్రులు, సమాజంలోని మేధావులు, విద్యారంగ నిపుణులను భాగస్వాముల్ని చేయాలనే లక్ష్యంతో ఏడాదిలో రెండుసార్లు మెగా పీటీఎంలు నిర్వహిస్తున్నారన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలు పాఠశాలల్లో ఎదుర్కొంటున్న సమస్యలను ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పుడే ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన వసతులు ఏర్పడతాయన్నారు. సమాజాన్ని సమూలంగా మార్చ గల శక్తి విద్యకు మాత్రమే ఉంటుందని, పదవులు, మనుషులు అశాశ్వతం అని, మనిషి నేర్చుకున్న విద్య, దాన్ని ఆచరణలో పెట్టి సాధించిన విజయాలు శాశ్వతంగా నిలిచిపోతాయన్నారు. జల్ జీవన్ మిషన్ ద్వారా నియోజకవర్గంలోని సాగు, తాగునీరు అవసరాల కోసం కేంద్రం రూ.2 వేల కోట్లు మంజూరు చేసిందని, ఆ పథకం పూర్తయితే నియోజకవర్గంలో నీటి సమస్య ఉండదన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, యువ నేత నారా లోకేశ్ మదనపల్లె జిల్లా, పీలేరు రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు సహకరించారని, ఆ రెండూ సాకారమైతే పీలేరు నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. పీటీఎంలో ఉపాధ్యాయులు తమ పాఠశాల ప్రగతి నివేదికను చదివి వినిపించారు. అనంతరం ఎమ్మెల్యే పాఠశాల విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో జిల్లా హౌసింగ్ పీడీ రమేశ్ రెడ్డి, డీవైఈఓ లోకేశ్వర రెడ్డి, ఏఎంసీ చైర్మన్ పురం రామ్మూర్తి, సింగిల్ విండో అధ్యక్షుడు రెడ్డప్ప రెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్‌లు ఆంజనేయులు, బుక్కే కాంతమ్మ, హెచ్ఎంలు శివశంకరయ్య, హరిబాబు రెడ్డి, టీడీపీ నేతలు శ్రీకాంత్ రెడ్డి, కోటపల్లె బాబు రెడ్డి, మల్లెల రెడ్డిబాషా, సురేంద్ర, గోళ్ల కిశోర్ నాయుడు, హనీఫ్, షరీఫ్, జీవీ రవికుమార్, జనసేన నేతలు కలప రవి, గజేంద్ర, మోహనకృష్ణ, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పండుగ వాతావరణంలో...

మండలంలో పీటీఎంలు పండుగ వాతావరణంలో జరిగాయి. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో పీటీఎంలు నిర్వహించి విద్యార్థుల ప్రగతి నివేదికలను వారి తల్లిదండ్రులకు అందించారు. ఆయా విద్యా సంస్థల్లో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్ రెడ్డి, విశ్రాంత ప్రిన్సిపాల్ హరినాథరెడ్డి, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటలక్ష్మీ, మహాత్మా జ్యోతిబా పూలే గురుకులం ప్రిన్సిపాల్ పర్వీన్నిసా, పేరెంట్స్ కమిటీ చైర్మన్ విజయకుమారి, వీఎస్ఎన్ సిద్దార్థ సంస్థల అధినేత్రి మాధవి, భువనా విద్యాలయం ప్రిన్సిపాల్ గుణలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై పర్యవేక్షణ ఉండాలి

మదనపల్లె అర్బన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్ కోసం తల్లిదండ్రులు పర్యవేక్షణ అవసరమని ఎమ్మెల్యే షాజహాన్‌బాష అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, నీరుగట్టువారిపల్లెలోని వివేకానంద మున్సిపల్ హైస్కూల్, బీకేపల్లెలోని ప్రభుత్వ గురుకులపాఠశాల, అవెన్యూ రోడ్డులోని ఉర్దూ హైస్కూల్ విద్యార్థుల తల్లిదండ్రులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థుల చదువు కోసం రాష్ట్రప్రభుత్వం ఎన్నో సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు నైపుణ్యంతో విద్యను అందించడంతో వారిలోని ప్రతిభను చాటడానికి వీలుందన్నారు. వారు తయారు చేసిన సైన్స్‌ఫేర్ చిత్రాలను పరిశీలించారు. ఎంఈఓ ప్రభాకర్ రెడ్డి, హెచ్ఎంలు సుబ్బారెడ్డి, షాజహాన్‌బాష, ఉపాధ్యాయులు, టీడీపీ నేతలు పురుషోత్తం, కమలమరికృష్ణ, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సదుపాయాలు

కలికిరి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అవసరమైన నాణ్యమైన సదుపాయాలు కల్పిస్తున్నట్లు పలువురు నేతలు గుర్తు చేశారు. రాష్ట్ర జంగం సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ వాసునూరి చంద్రశేఖర్ బీసీ గురుకుల పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ మాలతి బాలికోన్నత పాఠశాల కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మండల వ్యాప్తంగా జరిగిన సమావేశాల్లో టీడీపీ నేతలు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధే ధ్యేయం

వాల్మీకిపురం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని వాల్మీకిపురం మార్కెట్ కమిటీ చైర్మన్ కోసూరి చంద్రమౌళి అన్నారు. మండల వ్యాప్తంగా మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశాలను ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించారు. స్థానిక వీపీసీ ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలలో సాంస్కృతిక సాంప్రదాయాల నడుమ వేడుకలు చేసుకున్నారు. ఎంపీడీఓ మనోహర్ రాజు, ప్రిన్సిపాల్ ఉమాఅమరేశ్వరి, రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లిగట్ల వెంకటరమణ, నేతలు, పాఠశాలల కమిటీ చైర్మన్లు, వివిధ పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

మెరుగైన ఫలితాల సాధనకు ప్రత్యేక చర్యలు



బి.కొత్తకోటలో మాట్లాడుతున్న రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తిగౌడ్

బి.కొత్తకోట, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యావ్యవస్థ పటిష్టతకు, ప్రభుత్వ బడుల్లో మెరుగైన ఫలితాల సాధనకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని రాష్ట్ర గౌడకార్పొరేషన్ చైర్మన్ గురుమూర్తిగౌడ అన్నారు. మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మెగాపేరెంట్స్ మీటింగ్ నిర్వహించారు. బి.కొత్తకోట బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పర్వీన్‌తాజ్ మాట్లాడుతూ ఎన్నికల హామీలో భాగంగా తల్లికి వందనం పథకం ద్వారా ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అందరికీ నిధులు జమ చేసిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు దక్కిందన్నారు. నగరపంచాయతీ కమీషనర్ జీవీ పల్లవి, నేతలు కుడుం శ్రీనివాసులు, నారాయణస్వామి రెడ్డి, డి.నారాయణ, బంగారువెంకట్రమణ, రియాజ్‌అలీ, నాసర్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

వాజ్‌పేయి విగ్రహ పతిష్ఠను విజయవంతం చేయండి



కార్యకర్తలతో మాట్లాడుతున్న బీజేపీ నేత చల్లపల్లి నరసింహారెడ్డి తదితరులు

నిమ్మనపల్లి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని దివంగతనేత అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహ ప్రతిష్ఠను విజవంతం చేయాలని బీజేపీ సీనియర్ నేత చల్లపల్లి నరసింహారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో ఆయన మాట్లాడుతూ వాజ్‌పేయి మధ్యతరగతి బ్రాహ్మణ కుటుంబంలో జన్మించి 1942లో బ్రిటీష్ వలస పాలన అంతానికి క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారన్నారు. స్వతంత్ర్యం వచ్చాక విదేశాంగ మంత్రి మొదలుకొని ప్రధాని వరకు ఎదిగాడంటే అతిశయోక్తి కాదు. ప్రజల్లో నుంచి వచ్చిన మనిషిగా దృఢ సంకల్పంతో మంచి మనిషిగా రాజకీయంగా ఎదిగాడన్నారు. భారత దేశానికి ఎన్నో సంస్కరణలను తీసుకువచ్చారని తెలిపారు. ఈనెల 14న మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహ పతిష్ఠను మదనపల్లిలోని అన్నమయ్య సర్కిల్ నీరుగిట్టివారిపల్లి దగ్గర ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మండలం నుంచి కూటమి కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సునీల్, ప్రశాంత్, మదన మోహన్‌రెడ్డి, నాగరాజ, చిన్నరెడ్డెప్ప, మణి పాల్గొన్నారు.

ఎట్టకేలకు సర్వీసు రోడ్ల నిర్మాణం షురూ

● పెల్లుబికిన ప్రజాగ్రహం, స్పందించిన ఎమ్మెల్యే, ఎస్పీ ● పోలీసుల పర్యవేక్షణలో పనులు ప్రారంభం

పీలేరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): జారుడు బండలు, అడుసు మడులను తలపించిన రోడ్లతో విసిగివేశారిన పీలేరు ప్రజలకు శుక్రవారం కాసింత సాంత్వన లభించింది. ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి, ఎస్పీ ధీరజ్ కునుబిల్లి చొరవతో ఆర్ఓబీల కాంట్రాక్టు సంస్థ సర్వీసు రోడ్ల నిర్మాణం ప్రారంభించింది. ఇటీవల కురుస్తున్న వరుస వర్షాల కారణంగా ఆర్ఓబీల నిర్మాణం జరుగుతున్న పీలేరు-చిత్తూరు, పీలేరు-మదనపల్లె మార్గాలు చాలా అధ్వానంగా తయారయ్యాయి. అడుగు తీసి అడుగు వేయలేనంత దుర్భరంగా మారాయి. వాటి దుస్థితిపై స్థానికులు సోషియల్ మీడియా వేదికగా రెండు రోజులుగా తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి సాగుతున్న ఆర్ఓబీల నిర్మాణాల కారణంగా రోజూ ప్రమాదాలు జరుగుతున్నా అధికార యంత్రాంగం, కాంట్రాక్టు సంస్థ పట్టించుకోవడం లేదని పలువురు దుమ్మెత్తి పోశారు. వాటి సత్వర నిర్మాణానికి పీలేరులో ఒక రోజు బంద్ పాటించాలని ప్రణాళికలు రూపొందించుకున్నారు. అంతేకాకుండా దుర్భరంగా మారిన రోడ్ల ఫొటోలను అటు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి, ఇటు జిల్లా ఉన్నతాధికారులకు ప్రజలు పంపి ఫిర్యాదు చేశారు. దీంతో గురువారం రాత్రి ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి కాంట్రాక్టు సంస్థపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనల మేరకు సర్వీసు, అప్రోచ్ రోడ్లు నిర్మించాల్సి ఉన్నప్పటికీ వాటి గురించి పట్టించుకోని సంస్థపై కేసు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించారు. అదే సమయంలో రోడ్ల సమస్యపై ఎస్పీ ధీరజ్ కునుబిల్లి సైతం స్పందించారు. వారిద్దరి ఆదేశాల మేరకు పీలేరు అర్బన్ సీఐ యుగంధర్ శుక్రవారం ఉదయం కాంట్రాక్టు సంస్థ సిబ్బందికి అల్టిమేటం జారీ చేశారు. దీంతో వారు యుద్ధప్రాతిపదినక శుక్రవారం ఉదయం నుంచి మదనపల్లె, చిత్తూరు మార్గంలో సర్వీసు రోడ్ల నిర్మాణానికి సిద్ధమయ్యారు. నిర్మాణ ప్రక్రియను సీఐ యుగంధర్ పర్యవేక్షించారు. మరో రెండు రోజుల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా రోడ్లను రాకపోకలకు అనువుగా సిద్ధం చేస్తామని సీఐ తెలిపారు. ఎమ్మెల్యే, పోలీసుల చొరవను స్థానికులు అభినందించారు.




చిత్తూరు మార్గంలో రోడ్డు నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న సీఐ - మదనపల్లె మార్గంలో రోడ్డు పనులు చేస్తున్న దృశ్యం

దారి సమస్య పరిష్కారం



దారి సమస్యను వివరిస్తున్న నల్లగుట్ట వాసులు

ములకలచెరువు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక నల్లగుట్ట వాసుల దారి సమస్య పరిష్కారమైంది. తంబళ్లపల్లె నియోజవర్గ టీడీపీ యువనేత కట్టా దొరస్వామి నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా చొరవతో సమస్యకు పరిష్కారం లభించింది. ఉర్దూ స్కూల్ వద్దగల నల్లగుట్ట వాసులు బస్‌స్టాండుకు రావాలంటే ఏళ్ల తరబడి ఆర్టీసీ బస్‌స్టాండు మార్గం ద్వారా కాలినడకన రాకపోకలు సాగించేవారు. ప్రస్తుతం ఆర్టీసీ బస్‌స్టాండు స్థలంలో ప్రహరీ గోడ నిర్మిస్తున్నారు. దారి మూసేస్తే రెండు కిలో మీటర్లు చుట్టూ తిరిగి బస్‌స్టాండుకు వెళ్లాల్సి ఉంటుందని విషయాన్ని శుక్రవారం టీడీపీ నేతల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో యువ నేత కట్టా దొరస్వామి నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా తదితరులు నల్లగుట్టకు చేరుకుని దారిని పరిశీలించారు. సమస్యపై ఫోన్‌లో ఆర్టీసీ అధికారులతో మాట్లాడారు. దారి వదిలి ప్రహరీగోడ నిర్మించాలని కోరారు. దీంతో సమస్యకు పరిష్కారం లభించింది. కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి, నేతలు చెన్నకిష్టా, తోట గిరిధర్, తంబళ్ల శివన్న, ఉమాశంకర్, రెడ్డెప్ప పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి : సీజీఎం



సమీక్షలో మాట్లాడుతున్న సీజీఎం జానకీరామ్

పీలేరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలని ఏపీ ట్రాన్స్‌కో ఆపరేషన్స్ చీఫ్ జనరల్ మేనేజర్(సీజీఎం) జానకీరామ్ తన సిబ్బందిని ఆదేశించారు. పీలేరు డివిజన్ పరిధిలోని ట్రాన్స్‌కో సిబ్బందితో శుక్రవారం ఆయన పీలేరులో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ రైతులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే పంటలకు నష్టం జరిగే ప్రమాదముందన్నారు. తమ పరిధిలోని ప్రతి ప్రాంతాన్ని సిబ్బంది ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. అనంతరం పీలేరు డివిజన్ పరిధిలో పీఎం సూర్యఘర్ పథకం, 33/11 కేవీ సబ్-స్టేషన్‌ల నిర్మాణాల్లో పురోగతి, పబ్లిక్ పాజిటివ్ పర్సెప్షన్ సాధించడం వంటి అంశాలపై సబ్-స్టేషన్‌ల వారీ సమీక్షించారు. రాయలసీమ ప్రాంత ఆపరేషన్స్ ఎస్ఈ సోమశేఖర రెడ్డి, పీలేరు ఈఈ చంద్రశేఖర రెడ్డి, డీఈ అమీర్ బాషా, పీలేరు డివిజన్‌లోని ఏడీఈలు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా ఏర్పాటుతో పెరగనున్న ఉపాధి అవకాశాలు

మదనపల్లె అర్బన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మదనపల్లె జిల్లా ఏర్పాటుతో భవిష్యత్ తరాలకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ఎమ్మెల్యే షాజహాన్‌బాష అన్నారు. శుక్రవారం కొండామరిపల్లెలో టీడీపీ నేత జయరామ్, మండల తెలుగు యువత రూరల్ అధ్యక్షుడు వెంకటరమణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన థ్యాంకు సీఎం కార్యక్రమంలో ఎమ్మెల్యే హాజరై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తాజ్ మస్రూర్, పరుపుల జయరాం యాదవ్, వెంకటరమణ యాదవ్, కృష్ణమూర్తి, రెడ్డెప్ప, జాఫరున్నీసా, రజినీ, నవీన్‌చావిది, ఎస్ఎం రఫీ, షంషీర్, మల్లికార్జునాయుడు, గురునాథ్ యాదవ్ పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే చోరీల నివారణ



ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న సీఐ

పీలేరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రయాణ సమయాల్లో అప్రమత్తంగా ఉండడం ద్వారా దొంగతనాలకు అరికట్టవచ్చని పీలేరు సీఐ యుగంధర్ ప్రయాణికులకు సూచించారు. దొంగతనాల నివారణపై శుక్రవారం రాత్రి ఆయన పీలేరు ఆర్టీసీ బస్‌స్టాండ్‌లో ప్రయాణీకులకు అవగాహన కల్పించారు. బస్సులు ఎక్కేటప్పుడు ప్రతి మహిళా తన వద్ద ఉన్న విలువైన వస్తువులున్న బ్యాగులను జాగ్రత్తగా పెట్టుకోవాలన్నారు. రద్దీ సమయాల్లో అనుమానితులు తిరుగుతున్నట్లుంటే వెంటనే ఆర్టీసీ అధికారులకు, పోలీసులకు గానీ సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో స్టేషన్ మేనేజర్ బాబు నాయక్, ఏడీసీలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక



అయూబ్‌ఖాన్ - రమాదేవి - సురేష్

రామసముద్రం, డిసెంబరు 5 (ఆంధ్ర జ్యోతి): మండల ఎస్టీయూ ఎన్నిక శుక్రవారం జరిగింది. మండల అధ్యక్షుడిగా అయూబ్‌ఖాన్, ప్రధాన కార్యదర్శిగా రమాదేవి, ఆర్థిక కార్యదర్శిగా సురేష్ ఎన్నికయ్యారు. మండల గౌరవాధ్యక్షుడిగా శివశంకర్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా చెంగల్రాయచా రి, అదనపు ప్రధాన కార్యదర్శిగా కేశవకుమార్, మహిళా కన్వీనర్లుగా రాధ మ్మ, కుసుమ, సీపీఎస్ కన్వీనర్లుగా కృష్ణమూర్తి, కృష్ణయ్య, మైనార్టీ కన్వీనర్లు గా సయ్యద్‌బాషా, ఇర్ఫాన్, ఉపాధ్యాయ వాణి కన్వీనర్‌గా సుధాకర్, ఉపాధ్యక్షులుగా సోమశేఖర్, షాహిరా, రెడ్డెమ్మ, జ్యోతిని ఎన్నుకున్నారు. జిల్లా కౌన్సిలర్లుగా కడియాల మురళి, సుబ్బారెడ్డి, ఇ.నరసింహులు, అనిల్‌కుమార్, మనోహర, ప్రకాష్‌రెడ్డి, మహీధర్‌రావు, జగన్నాథరెడ్డి, వై.నరసింహులు, సుధాకర్, వెంకటప్రసాద్ ఎన్నికయ్యారు. అంతా ఏకగ్రీవాలైనట్లు ఎన్నికల అధికారి, జిల్లా ఉపాధ్యక్షుడు శంకర్ ప్రకటించారు.

అయ్యప్ప దీక్ష స్వీకరించిన మాజీమంత్రి



అయ్యప్ప స్వామిని దర్శించుకుంటున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకా వెంకటాచలపతి, సి.పి.సుబ్బిరెడ్డి

మదనపల్లె, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకా వెంకటాచలపతి, మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో కలిసి అయ్యప్పస్వామి దీక్ష స్వీకరించారు. మాజీమంత్రి స్వగ్రామం సదుంలోని అయ్యప్పస్వామి ఆలయంలో శుక్రవారం ఈఏడాది రెండోసారి దీక్ష తీసుకున్నారు. ఏటా చేపట్టే క్రమంలో ఈఏడాది కూడా పెద్దిరెడ్డితో కలిసి వైసీపీ సీనియర్ నేత సి.పి.సుబ్బిరెడ్డి, జింకా వెంకటాచలపతి అయ్యప్ప మాలధారణ చేశారు. 41 రోజులు దీక్ష అనంతరం మకర సంక్రాంతిని పురస్కరించుకుని ఇదే ఆలయంలో అయ్యప్ప స్వామికి మొక్కు చెల్లించి దీక్షను విరమించనున్నారు.

నకిలీ ఎరువులు విక్రయిస్తే చర్యలు

తంబళ్లపల్లె, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రైతులకు నకిలీ ఎరువులు, విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని పీలేరు వ్యవసాయ శాఖ ఏడీఏ రమణరావు హెచ్చరించారు. శుక్రవారం మండల వ్యవసాయాధికారి రమణ కుమార్‌తో కలిసి తంబళ్లపల్లెలోని పుడమి కిసాన్ మార్ట్, మన గ్రోమోర్, జై కిసాన్ తదితర ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఎరువులు, విత్తనాల నాణ్యత, స్టాకు రిజిస్టర్, బిల్లు పుస్తకాలు, కంపెనీ ఇన్‌వాయిస్, గోదాములను పరిశీలించారు. అమ్మకాలు, కొనుగోళ్ల బిల్లులను పరిశీలించి స్టాకు బోర్డు, స్టాకు రిజిస్టర్లను రోజూ అప్‌డేట్ చేసుకోవాలని సూచించారు. కాలం చెల్లిన, నకిలీ ఎరువులు విక్రయించినట్లు ఫిర్యాదులొస్తే దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. వారి వెంట వీఏఏ సురేష్, సుధాకర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే కఠిన చర్యలు

● ప్రభుత్వ భూమి వద్ద హెచ్చరిక బోర్డులు

నిమ్మనపల్లి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ భూములను ఎవరైనా ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ తపస్విని హెచ్చరించారు. శుక్రవారం రెడ్డివారిపల్లి పంచాయతీ జాండ్రబైలు వద్ద వున్న సర్వే నెంబరు.1037లో 88.72ఎకరాల ప్రభుత్వ భూమి వున్నట్లు తెలిపారు. కొందరు వ్యక్తులు దాదాపు నాలుగెకరాలు భూమిని చదును చేసి ఆక్రమించుకునేందుకు ప్రయత్నించినట్లు తెలిపారు. ఇది గమనించిన రెవెన్యూ సిబ్బంది రెండు చోట్ల ప్రభుత్వ భూమిగా హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. అనంతరం ఆర్ఐ రమేష్ మాట్లాడుతూ గతంలో కూడా బండ్లపై పంచాయతీలో కొందరు వ్యక్తులు ప్రభుత్వ భూమిని ఆక్రమించుకునేందుకు ప్రయత్నించగా వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎవరైనా ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పంచాయతీ స్థలాన్ని కాపాడండి

మదనపల్లె, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): దేవతానగర్‌లోని విలువైన పంచాయతీ స్థలాన్ని కాపాడాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనర్‌కు బీవైఎస్ అధ్యక్షుడు పునీత్‌కుమార్ ఫిర్యాదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా పని చేస్తున్న ఎంపీడీఓపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. దేవతానగర్‌లో పంచాయతీకి కేటాయించిన స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులు ఆక్రమించారని, వారిపై 2010లోనే క్రిమినల్ కేసు నమోదైందని కమిషనర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కేసు విచారణ ఈఏడాది ఫిబ్రవరిలో కోర్టు ముందుకు వచ్చిందని, ఈకేసులో అధికారులు సరైన రికార్డులు కోర్టుకు సమర్పించడంలో విఫలమయ్యారని ఆయన ఆరోపించారు. దీని వెనుక రాజకీయ నేతలు, అవినీతి అధికారుల ప్రమేయం ఉందని ఆరోపించారు.

త్వరలో దోబీ ఘాట్ నిర్మాణం

పీలేరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పీలేరు-తిరుపతి మార్గంలో త్వరలో దోబీ ఘాట్ నిర్మించనున్నట్లు సాయిబాబా రజక సంఘం అధ్యక్షుడు వెంకటరమణ ప్రకటించారు. పీలేరులో శుక్రవారం రజక సంఘం సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ నూతన దోబీ ఘాట్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.28 లక్షల నిధులు మంజూరు చేసిందని, త్వరలోనే నిర్మాణ పనులు చేపడతామన్నారు. సంఘ కార్యదర్శి వెంకటరమణ, సభ్యులు సిద్దయ్య, అనిల్, నాగార్జున, కిరణ్, ఉషారాణి, ఇందిర, రమణ, కందుకూరి నాగార్జున, మల్లి, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల బలోపేతమే లక్ష్యం

ములకలచెరువు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే ప్రభుత్వ లక్ష్యమని నియోజక వర్గ టీడీపీ యువనేత కట్టా దొరస్వామినాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా అన్నారు. మండలంలోని ములకలచెరువు జడ్పీ హైస్కూల్, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో శుక్రవారం జరిగిన పీటీఎం కార్యక్రమంలో వారు మాట్లాడుతూ విద్యార్థుల చదువు పట్ల తల్లిదండ్రులు కూడా బాధ్యత వహించాలన్నారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు చెన్నకిష్టా, హెచ్ఎం కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.